PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 150 | విజయవాడ, బుధవారం 1 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 1 January 2025 | Rs



టెస్టులకు రోహిత్ శర్మ గుడ్‌బై ?

జస్ప్రీత్ బుమ్రాకు పగ్గాలు..!

8



విశాఖ తీరంలో నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ యువత కేరింతలు

ఫొటో : కె రాజేష్

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు ప్రజాశక్తి

2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు

– సంపాదకులు



కేంద్రం చర్చలకు పిలిస్తే

వైద్య చికిత్సకు సిద్ధం

- రైతుల ప్రతిపాదన
- మరో మూడు రోజులు గడువిచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ : చర్చలకు కేంద్ర ప్రభుత్వం తమను ఆహ్వానించినట్లైతేనే నిరాహార దీక్షలో వున్న జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్ వైద్య సాయం తీసుకుంటారని రైతులు కేంద్రానికి లేఖ రాశారని పంజాబ్ ప్రభుత్వం మంగళవారం సుప్రీం కోర్టుకు తెలియజేసింది. తమ పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించడంతో సహా రైతుల డిమాండ్లను ఆమోదించాలని కోరుతూ నవంబరు 26 నుండి దల్లేవాల్ ఖానౌరి సరిహద్దు వద్ద నిరాహార దీక్ష చేస్తున్నారు. రైతులు, కేంద్ర ప్రభుత్వం మధ్య చర్చల వెనుక గల పరిస్థితుల గురించి వ్యాఖ్యానించడానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుధాంశు ధూలియాలతో కూడిన వెకేషన్ బెంచ్ తిరస్కరించింది. "చర్చల గురించి లేదా శాంతి భద్రతల పరిస్థితులపై దేనిమీదా వ్యాఖ్యానించబోం, తెర వెనుక జరిగే వాటిపై వ్యాఖ్యానించాలనుకోలేదు. రైతులకు, సంబంధిత పక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం ఏదైనా కుదిరితే మాకు కూడా సంతోషమే." అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. రైతు నేతను తక్షణమే దీక్షా శిబిరం నుండి ఆస్పత్రికి తరలించాలని పంజాబ్ ప్రభుత్వానికి తాము జారీ చేసిన ఆదేశాలను అమలు చేయకపోవడంపైనే కోర్టు ఆందోళన చెందుతోందని న్యాయమూర్తి పేర్కొన్నారు. దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించడానికి డిసెంబరు 31వరకు గడువు ఇస్తున్నట్లు 28వ తేదీన జరిగిన విచారణ సమయంలో సుప్రీంకోర్టు తెలిపింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైనందుకు పంజాబ్ చీఫ్ సెక్రటరీ, డిజిపి ఇద్దరూ కోర్టు ధిక్కార చర్యలను ఎదుర్కొంటున్నారు. దల్లేవాల్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తాము చేసిన ప్రయత్నాలను రాష్ట్ర అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్ కోర్టుకు వివరించారు. పంజాబ్ బంద్‌కు రైతులు పిలుపివ్వడంతో ఆ ప్రయత్నాలు భగ్నమయ్యాయన్నారు. తాజాగా కేంద్రానికి రైతులు లేఖ రాసిన నేపథ్యంలో పరిస్థితులు ఎలా మారతాయో చూసేందుకు తమకు మరో మూడు రోజులు సమయం కావాలని రాష్ట్రప్రభుత్వం కోరింది. కోర్టు అందుకు అనుమతించి ఈ కేసు విచారణను జనవరి 2వ తేదీకి వాయిదా వేసింది. పరిస్థితులను, న్యాయ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని మరింత సమయం కావాలన్న అభ్యర్థనను ఆమోదించాలని నిర్ణయించినట్లు కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

అర్హులకే పింఛన్లు

బోగస్ ఏరివేస్తాం • ప్రజలే నాకు హైకమాండ్ • ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అర్హులకే పింఛన్లు కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కొందరు బోగస్ పింఛనుదారులున్నారని, ఇటువంటి పింఛన్లను ఏరివేస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలే తనకు హైకమాండ్ అని, వారికే తాను జవాబుదారీగా ఉంటానని అన్నారు. పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం యల్లమంద గ్రామంలోని లబ్ధిదారులకు మంగళవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద సంఖ్యలో పింఛన్లు ఇవ్వడం లేదన్నారు. 'సూపర్ సిక్స్' అమలులో భాగంగా 2024 ఏప్రిల్ నుంచి రూ.4 వేల పింఛను ఇస్తున్నామన్నారు. లబ్ధిదారునికి ఇంటి వద్దే పింఛను ఇవ్వాలని, సచివాలయాల్లో ఇస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో కొంతమంది అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారని, ప్రధానంగా వికలాంగుల్లో ఎక్కువ మంది అనర్హులున్నారని, వారి ధ్రువపత్రాలు పరిశీలించి అర్హత లేకుంటే పింఛను తొలగిస్తామని, వారికి తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సి, ఎస్టిలకు వంద శాతం సబ్సిడీతో సూర్యఘర్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 300 యూనిట్ల వరకూ సబ్సిడీ ఉంటుందన్నారు. ఉచిత ఇసుక విధానంలో దందాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనకు వస్తున్నారంటే చెట్లు కొట్టేసి, పరదాలు కట్టి, జనాన్ని బలవంతంగా తరలించే వారని, తాను అలాంటి ముఖ్యమంత్రిని కాదని, నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి బాగోగులు చూసుకోవడమే తన బాధ్యతని అన్నారు.

త్వరలో గోదావరి–పెన్నా అనుసంధాన పనులు

గోదావరి–పెన్నా అనుసంధాన పనులు త్వరలో చేపడతామని చంద్రబాబు తెలిపారు. ఆ తర్వాత వెలుగొండ ప్రారంభం అవుతుందన్నారు. గోదావరి జలాలను బనకచర్లకు తీసుకెళ్లగలిగితే రాష్ట్ర ముఖచిత్రం మారుతుందని పేర్కొన్నారు. డ్రోన్ల ద్వారా వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తున్నామని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బు వేస్తున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నా మన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్లే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు.

రూ.3 లక్షల రుణం మంజూరు

ముఖ్యమంత్రి తన పర్యటనలో భాగంగా పింఛను లబ్ధిదారు శారమ్మ ఇంటికి వెళ్లి ఆ కుటుంబం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కరోనాలో భర్తను కోల్పోయిన శారమ్మ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. డాక్టర్ చదువుతానని చెప్పిన శారమ్మ కుమార్తెకు నీట్ కోచింగ్ ఇప్పించాలని, శారమ్మ కుమారుడికి ఎస్సి కార్పొరేషన్ నుంచి రూ.3 లక్షల రుణం అందించాలని అధికారులను ఆదేశించారు. పేదలకు పక్కా ఇళ్లు కట్టిస్తామన్నారు. వారికి గత ప్రభుత్వంలో ఉన్న ఇళ్ల బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని అధికారులను సిఎం ఆదేశించారు. కోటప్పకొండ ఆలయాన్ని సందర్శించారు. త్రికోటేశ్వర స్వామిని దర్శించు కున్నారు. ఆ ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని సిఎం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రామనారాయణ, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏడుకొండలు ఇంట్లో కాఫీ తయారు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

స్వయంగా కాఫీ పెట్టిన సిఎం

పల్నాడు జిల్లా యల్లమంద గ్రామంలో లబ్ధిదారులు తలారి శారమ్మ, ఏడుకొండలు ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లి వారికి పింఛను అందజేశారు. ఏడుకొండలు ఇంట్లో ముఖ్యమంత్రి స్వయంగా కాఫీ తయారు చేశారు. కుటుంబసభ్యులకు ఇచ్చి తానూ తాగారు. అనం తరం వారి కష్టసుఖాలు అడిగి తెలు సుకున్నారు. ఏడుకొండలు కుమారుడు ఇల్లు కట్టుకునేందుకు రుణంతోపాటు స్వయం ఉపాధి కోసం బిసి కార్పొరేషన్ నుంచి రూ.5 లక్షల రుణం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఏడుకొండలు నడు పుతున్న టైర్ల షాపునకు ప్రభుత్వం నుంచి రూ.60 వేలు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.



సిఎస్‌గా విజయానంద్ బాధ్యతల స్వీకరణ

- అనంతరం సిఎంతో భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా కె విజయానంద్ బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని మొదటి భవనంలో మంగళవారం నీరబ్‌కుమార్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. సిఎస్‌గా పదవీ విరమణ పొందిన నీరబ్‌కుమార్ ప్రసాద్.. విజయానంద్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పదవీ విరమణ చేసిన నీరబ్‌కుమార్‌కు విజయానంద్ కూడా శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా విజయానంద్‌ను పలువురు ఉన్నతాధికారులు అభినందనలు తెలియజేశారు.

ప్రజలను భ్రమల్లో ముంచొద్దు

- బాబు మాటలు జనం నమ్మే పరిస్థితి లేదు
- గోదావరి, బనకచర్ల లింకుపై అఖిలపక్షం
- విలేకరుల సమావేశంలో వి శ్రీనివాసరావు
- రాష్ట్ర మహాసభ లోగో అవిష్కరణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్పొరేట్లకు లాభాలు దోచిపెడుతూ, మాయమాటలతో ప్రజలను భ్రమల్లో ముంచే విధానాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మానుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఫిబ్రవరి 1నుండి 3వ తేది వరకు నెల్లూరులో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభ లోగోను మంగళవారం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎం.సీతారాం, వి.వెంకటేశ్వర్లు, లోకనాథం, డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అయితే, ప్రజలు మాత్రం ఆనందంగా లేరని, వారి చేతుల్లో డబ్బులు లేవని అన్నారు. ప్రజల ఆదాయాన్ని పెంచే విధానాల గురించి ఆలోచించకుండా రాష్ట్ర ప్రభుత్వం వారిపై మరింతగా భారాలు ఎలా వేయాలని, కార్పొరేట్లకు భారీగా ఆదాయాలు ఎలా పెంచాలని ఆలోచిస్తోందని చెప్పారు. ఆదాయం పెంచుకోవడం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పెడుతున్నారని వార్తలు వచ్చాయని, జిఎస్‌టి, టోల్‌టాక్స్ పెంచుతున్నారని, మరమరాలు, పాప్‌కార్న్‌ల మీద కూడా జిఎస్‌టి వేస్తున్నారని చెప్పారు. అదే సమయంలో ప్రజలను మభ్య పెట్టే మాటలు చెబుతున్నారని అన్నారు. 'ప్రజల్ని మబ్బుల్లో విహరింపచేసే భ్రమలు సృష్టించవద్దు. గతంలో ఈ ట్రిక్కులు పనిచేశాయి. నమ్మారు.ఈ సారి పనిచేయవు' అని అన్నారు. 2000 సంవత్సరంలో చంద్రబాబు అమలు చేసిన విద్యుత్ సంస్కరణలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 'విద్యుత్ సంస్కరణలను తానే తీసుకువచ్చినట్లు బాబు ఇప్పటికీ చెప్పుకుంటారు. అప్పట్లో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. నాణ్యమైన విద్యుత్ వస్తుందని, ఛార్జీలు తగ్గు తాయని అప్పట్లో చెప్పారు. ఛార్జీలు ఎక్కడ తగ్గాయి? నాణ్యమైన విద్యుత్ మిగతా 7లో

పవన్‌వి నిజాయితీ లేని విమర్శలు

- ఏ రూపంలో ఉన్నా మతోన్మాదాన్ని ఎదుర్కొంటున్నాం

హైదరాబాద్‌లో ఎంఐఎం ఏదో వ్యాఖ్యలు చేసిందని చెబుతూ వాటిపై కమ్యూనిస్టులు కూడా స్పందించలేదంటూ జనసేన అధినేత, రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన విమర్శలపై వి. శ్రీనివాసరావు తీవ్రంగా స్పందించారు. 'ఇది చాలా అన్యాయమైన, నిజాయితీ లేని విమర్శ' అని ఆయన అన్నారు. మతోన్మాదం ఏ రూపంలో ఉన్నా దానిని తాము మాత్రమే ఎదుర్కుంటున్నామని వి.శ్రీనివాసరావు చెప్పారు. హిందూ మతోన్మాదమైనా, ముస్లింమతోన్మాదమైనా ఏ రూపంలో ఉన్నా మేం ఎదుర్కుంటున్నాం. మేమే దాన్ని ఎదుర్కుంటున్నాం, వాళ్లు కాదు' అని ఆయన అన్నారు,2019లో జనసేన, సిపిఎం పొత్తు ఉన్న సమయంలో ఓల్డ్ సిటీలో ఎంఐఎంను ఎదుర్కొన్న దమ్ము సిపిఎంకు మాత్రమే ఉందని పవన్ కల్యాణ్ పదేపదే చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అప్పటి పార్టీ కార్యదర్శిగా ఉన్న పి. మధు ఎంఐఎంను ఎదుర్కుని చేసిన పోరాటం గురించి, పాతబస్తీలో సభ పెట్టి ఎంఐఎంను నిలదీసిన విషయం గురించి పవన్‌కల్యాణ్ అప్పట్లో పదేపదే చెప్పేవారని ఆయన అన్నారు. ఇతర పార్టీల నాయకులు కూడా ఈ విషయాన్ని ఒప్పుకుంటారని అన్నారు. 2012లో ఎంఐఎం పవన్‌కల్యాణ్ చెప్పిన వ్యాఖ్యలు చేసిందని, ఆ వ్యాఖ్యలను మిగతా 7లో

విద్వేషాలను రెచ్చగొడుతున్నారు

- మహారాష్ట్ర మంత్రి వ్యాఖ్యలపై కేరళ సిఎం పినరయి విజయన్

7



మామిడికి మంచు దెబ్బ

- పూతకు పక్షి కన్ను, బూడిద, మసి తెగుళ్లు
- ఎకరాకు అదనంగా రూ.నాలుగు వేల ఖర్చు
- దిగుబడులపై తీవ్ర పభావం
- జీడి మామిడి రైతులకూ కష్టకాలం

3

నేటి నుంచి 'ఇంటర్' విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం పున:ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించిన జిఓ 40ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం విడుదల చేశారు. 2014–19 టిడిపి హయాంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించింది. అనంతరం వైసిపి అధికారంలోకి రాగానే అమ్మఒడి అమలు చేస్తున్నామనే సాకుతో ఆ పథకాన్ని నిలిపివేసింది. ఎన్నికల సమయంలో ఈ పథకాన్ని మళ్లీ అమలు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే ఈ పథకాన్ని తిరిగి అమలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలో 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. 2024–25 సంవత్సరానికి రూ.27.39 కోట్లు, 2025–26 ఏడాదికి



రూ.85.84 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం పేర్కొంది. కొత్త సంవత్సరం సందర్భంగా బుధవారం నుంచి ఈ కార్యక్రమం అమలు కానుంది.

రైల్వే జోన్ వస్తుందా?

- వాల్తేరు డివిజన్ ఉంటుందా?
- 8న విశాఖకు మోడీ వస్తారా?
- డివిజన్, జోన్‌పై టిడిపి కూటమి పార్టీల్లో లేని స్పష్టత

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 8న ఉమ్మడి విశాఖ జిల్లాకు మోడీ వస్తారన్న ప్రచారంతో రైల్వే జోన్ విషయంపైనా తాజాగా చర్చ నడుస్తోంది. గడిచిన ఐదేళ్లలో విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం శంకుస్థాపనకు ప్రధాని మోడీ వస్తారన్న ప్రచారం గతంలోనూ చాలాసార్లు జరిగింది. అయితే, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఉంచుతారా? జోన్ వస్తుందా? అన్నది ప్రకటించలేదు. దేశంలోనే అత్యధిక ఆదాయంగల రైల్వే డివిజన్ వాల్తేరు (విశాఖపట్నం)కు సరుకు రవాణా వల్ల ఏటా సుమారు రూ.8,900 కోట్లు ఆదాయం చేకూరుతోంది. 1893లో ఏర్పాటైన ఈ డివిజన్‌కు 131 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. అటువంటి వాల్తేరు డివిజన్‌ను నిర్ధాక్షిణ్యంగా బిజెపి ఎత్తేసి సౌత్ కోస్ట్ జోన్ ఇస్తానని చెబుతూ ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది. వాల్తేరు డివిజన్‌ను రాయగడ డివిజన్లో కొంత, విజయవాడ



డివిజన్లో ఇంకొంత కలిపేసి విశాఖకు తీవ్ర ద్రోహం తలపెట్టాలని చూస్తోంది.

రాజకీయ ప్రచారం : రైల్వే అధికారులు

'ఈ నెల 8న మోడీ వస్తున్నారన్నది రాజకీయ ప్రచారమే. ఆయన పర్యటనపై మా వరకూ ఎలాంటి సమాచారమూ లేదు' అని విశాఖపట్నం రైల్వే ఉన్నతాధికారులు తాజాగా 'ప్రజాశక్తి' వద్ద ప్రస్తావించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటిస్తారని, రైల్వే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారని టిడిపి కూటమి పార్టీల నాయకులు చెప్తున్నారు. స్థలం ఎక్కడ? ముడ సర్లోవలోగల 52 ఎకరాలా? నగరం నడిబొడ్డునగల రైల్వే స్థలమైన వైర్‌లెస్ కాలనీలోని 16 ఎకరాలా? అనేది ప్రభుత్వం తేల్చకపోవడంతో రైల్వే ఉన్నతాధికారులు గందరగోళంలో ఉన్నారు. స్థలాన్నే తేల్చులేకపోతున్న దశలో ప్రధానికి ఏ స్థలం చూపిస్తారు? అంటూ రైల్వే సిబ్బందిలో చర్చ సాగుతోంది.

బ్లూ ప్రింట్‌తో సరి!

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ (సౌత్ కోస్ట్ రైల్వే జోన్) ప్రచారం 2014 నుంచీ కేంద్ర బిజెపి నేతలు చేస్తూనే ఉన్నారు. వాస్తవానికి ఇది విభజన హామీ కూడా. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల డిమాండ్‌గా మూడు దశాబ్దాలుగా ఇది ఉంది. 2024 డిసెంబరు 27లోపు టెండర్లను దాఖలు చేయాలని తొలుత పేర్కొన్నారు. గత నవంబర్ 29న పరవాడలో ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రారంభానికి మోడీ విచ్చేస్తున్న సందర్భంగా జోన్‌కూ పునాదిరాయి పడుతుందని రాజకీయ ప్రచారం సాగింది. వైర్‌లెస్ కాలనీలోని 16 ఎకరాల్లో 11 అంతస్తుల భారీ భవన నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని, రైల్వే జోనల్ మేనేజర్ కార్యాలయం సహా తొమ్మిది ఫ్లోర్‌లు, సెల్లార్ పార్కింగ్‌లకు రెండు ఫ్లోర్‌లు నిర్మాణానికి రూ.149.16 కోట్ల అంచనాలు సిద్ధమైపోయాయన్న ప్రచారం కేంద్ర బిజెపి పెద్దలు చేశారు. మోడీ పర్యటన రద్దు కావడంతో అది తుస్సుమంది. జనవరి ఎనిమిదిన మోడీ రాక, జోన్‌కు పునాదిరాయి కూడా అంతేనా? అంటే అవుననే సమాధానం వస్తోంది. కనీసం టెండర్లు కూడా పిలవకపోవడం ఇందుకు తార్కాణం.


పెరిగిన బంగారం రుణ ఎన్‌పిఎలు

3

'ఉక్కు'పై ద్వంద్వ వైఖరి విడనాడాలి

- పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి విడనాడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1419వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా కార్మికులు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ఓ వైపు ఉత్పత్తి విధుల్లో ఉంటూ మరోవైపు ఉద్యమం నిర్వహిస్తుండడం అభినందనీయమని తెలిపారు. ఈ పోరాటాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా తన తీరును మార్చుకుని ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు ఐఎఎస్‌లకు పదోన్నతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముగ్గురు ఐఎఎస్ (2009 బ్యాచ్) అధికారులకు ప్రభుత్వం సూపర్ టైమ్‌స్కేల్‌కు పదోన్నతి కల్పించింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 2221ని మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. 2009 బ్యాచ్‌కు చెందిన కార్తికేయ మిశ్రా ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శిగా కొనసాగుతారు. 2009 బ్యాచ్‌కు చెందిన వీరపాండియన్ సెర్ప్ సిఇఓగా అదే పదవిలో కొనసాగుతారు. 2009 బ్యాచ్‌కు చెందిన సి శ్రీధర్ వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టరుగా కొనసాగుతారని జిఓలో పేర్కొన్నారు.

నేటి నుంచి నూతన రైల్వే పబ్లిక్ టైమ్ టేబుల్

- దక్షిణ మధ్య రైల్వే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైలు సమయాల్లో జనవరి ఒకటి నుంచి నూతన రైల్వే పబ్లిక్ టైమ్ టేబుల్ అమల్లోకి రానుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. జనవరి ఒకటి నుంచి ప్రయాణించే ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ప్రారంభించే ముందు వాస్తవ రైలు సమయాలను తనిఖీ చేసుకోవాలని సూచించింది. రైళ్లకు సంబంధించిన సమాచారం, సంబంధిత స్టేషన్లలో సమయాల మార్పులను ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్ ఞఞఞ.అతీఞ్ఞ.ఝ.అను నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్ (ఎన్‌టిఇఎస్)ను సందర్శించడం లేదా సంబంధిత రైల్వే స్టేషన్లలోని స్టేషన్ మేనేజరు/విచారణ కేంద్రాన్ని సంప్రదించడం ద్వారా పొందవచ్చని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణపై నిరసన

- విశాఖ, కర్నూలులో ఎస్‌ఇ కార్యాలయాల ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం), నంద్యాల

విద్యుత్ డిస్కంల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ గ్రీన్ పార్క్ హోటల్‌కు ఎదురుగా ఉన్న విద్యుత్ ఎస్‌ఇ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం ఆందోళన చేపట్టారు. భారీ కరెంటు బిల్లు నమూనా, విసనకర్రలు, లాంతర్లు, కిరోసిన్ బుడ్డి దీపాలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ.. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. చండీగఢ్‌లో విద్యుత్ డిస్కంలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం పూనుకుందని, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అక్కడ విద్యుత్ కార్మికుల చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా విశాఖలో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

చండీగఢ్ రాష్ట్ర డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను కార్పొరేట్ సంస్థ అయిన ఎమినేంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ కంపెనీకి అమ్మడానికి డిసెంబర్ నాలుగున అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. లాభాల్లో ఉన్న చండీగఢ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రయివేటుపరం చేయడం ఎంతమాత్రమూ తగదన్నారు. మన రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో విద్యుత్తును ప్రయివేటీకరణ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోందన్నారు. అందులో భాగంగానే ట్రూ అప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై మోయలేని భారాలను మోపుతున్నారని, స్మార్ట్ మీటర్ల పేరుతో నిలువు దోపిడీకి పూనుకున్నారని తెలిపారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలను, కార్మికులను సమీకరించి పోరాడతామని తెలిపారు. నంద్యాల జిల్లా విద్యుత్ ఎస్‌ఇ కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు పాల్గొన్నారు. చండీగఢ్ విద్యుత్ డిస్కం ప్రయివేటీకరణ దుర్మార్గమన్నారు.



విశాఖలో వినూత్నరీతిలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

'సూపర్ సిక్స్' తప్పకుండా నెరవేరుస్తాం

- టిడిపి సభ్యత్వ నమోదు పొడిగింపు
- మహానాడులోపు కమిటీల నియామకం
- పార్టీ నాయకులతో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల సమయంలో హామీలిచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తప్పకుండా నెరవేర్చుతామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆరు నెలల పాలనలో అనేక కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, మండలాధ్యక్షులు, క్రియాశీల కార్యకర్తలతో సిఎం చంద్రబాబు మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 తమకు ఇన్‌స్పైరింగ్ సంవత్సరమని, వ్యూహాత్మకంగా ముందుకెళ్లడంతో ఎన్నికల్లో తిరుగులేని విజయం దక్కిందన్నారు. సోషల్ రీ ఇంజినీరింగ్ విధానానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచి దానిని పేదలకు ఖర్చు చేస్తామన్నారు. తమ ప్రభుత్వం ఏడాదికి రూ.33 వేల కోట్లతో 64 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నామని వివరించారు. వాటిని ఇంటికెళ్లి ఇస్తున్నారో లేదో జియో ట్యాగింగ్ ద్వారా తెలుసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చి ప్రజల్ని మోసం చేసిందని విమర్శించారు. గత పాలకులు ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి ఎడాపెడా అప్పులు చేశారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల నిర్వీర్యమైన వ్యవస్థలను గాడినపెట్టడం వల్ల ప్రజల్లో మరింత నమ్మకం వచ్చిందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను కూడా తీసుకురాబోతున్నామని చెప్పారు. దౌర్జన్యాలు, దుర్మార్గాలు ఎదుర్కొని అధికారంలోకి వచ్చామని, ఎవరూ అజాగ్రత్తతో ఉండొద్దని భరోసా ఇచ్చారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర అనుబంధ సంఘాల పదవులన్నీ పార్టీ కోసం కష్టపడ్డవారికే కేటాయిస్తామని తెలిపారు. రాత్రికి రాత్రి అన్నీ జరిగిపోవని చెప్పారు. గత ఐదేళ్ల కార్యకర్తలను కాపాడుకోవడానికి పనిచేశానని, ఇప్పుడు గుర్తించడానికి పనిచేస్తామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా ఒకపక్క పాలన సాగిస్తూనే మరోవైపు కార్యకర్తలకు సమయం కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యకర్తలను నాయకులు కలుపుకుని వెళ్లాలని సూచించారు. సభ్యత్వ నమోదు మంగళవారంతో ముగించాల్సి ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల విజ్ఞప్తి మేరకు మరో 15 రోజులు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 26న ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రారంభించామని, ఇప్పటికే 93 లక్షలు దాటాయని తెలిపారు. సభ్యత్వ నమోదులో పాలకొల్లు, ఆత్మకూరు, నెల్లూరు సిటీ, కుప్పం, రాజంపేట, ఉండి, కళ్యాణదుర్గం, గురజాల, వినుకొండ, మంగళగిరి నియోజకవర్గాలు మొదటి 10 స్థానాల్లో ఉన్నాయని వెల్లడించారు. మహానాడులోపు అన్ని కమిటీల నియామకాలు పూర్తి చేస్తామన్నారు.

నేడు టిడిపి కార్యాలయానికి సిఎం

సిఎం చంద్రబాబు బుధవారం టిడిపి కార్యాలయానికి రానున్నారు. ఆయనను కలవటానికి వచ్చేవారెవరూ బొకేలు, పూలదండలు, కేక్, స్వీట్ బాక్సులను తీసుకురావొద్దని, వాటిని అనుమతించబోమని కార్యాలయ కార్యదర్శి పి అశోక్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటికయ్యే ఖర్చుతో చెట్లు నాటడం, పేదలకు భోజన సదుపాయం, విద్యార్థులకు పెన్నులు వంటి బహుమతులివ్వటం వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

మతతత్వ శక్తులపై కఠిన చర్యలు

- సాహితీ స్రవంతి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో సంఘ్ పరివార్ మతతత్వ రాజకీయాలు హద్దు మీరుతున్నాయని, ప్రభుత్వాలు ఈ మతతత్వ శక్తులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని సాహితీ స్రవంతి కోరింది. మతతత్వ దాడులను, హిందుత్వ పేరిట చేస్తున్న దౌర్జన్యాలను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సాహితీ స్రవతి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెంగార మోహన్, కె.సత్యరంజన్, గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటువంటి అసహనదాడులకు ప్రజాస్వామ్యంలో చోటులేదని, లౌకిక శక్తులు సహించబోవని పేర్కొన్నారు. హైదరాబాద్ తుక్కుగూడలో కంబలి రాములు అనే దళిత ఉపాధ్యాయుడిపై మతపరమైన ఆరోపణలతో దౌర్జన్యానికి ఈ శక్తులు పాల్పడ్డాయని తెలిపారు. విద్యార్థిని ప్రశ్నలు వేస్తుంటే, దానికి మత కోణం ఆపాదించి మోకాళ్లపై నిలబెట్టి అవమానించారని పేర్కొన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో పరిశోధనాత్మక పుస్తకాలను విక్రయిస్తున్న పాత్రికేయులు, రచయిత ఎన్ వేణుగోపాల్‌పై అసహనంతో దాడి చేసి బెదిరింపులకు దిగాయని విమర్శించారు.. అసత్య ప్రచారాలతో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాయని, కొద్ది రోజుల కిందట రాష్ట్రంలోని తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీలో ఇటువంటి దౌర్జన్యానికే ఈ శక్తులు పాల్పడినట్లు పేర్కొన్నారు.

కోడి పందేలకు సిద్ధం !

- బరుల ఏర్పాట్లలో నిర్వాహకులు
- నాయకుల అండదండలతో భారీ ఏర్పాట్లకు ప్రయత్నాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కోడి పందేలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సిద్ధమవుతోంది. బరుల ఏర్పాటు కోసం నిర్వాహకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నాయకుల అండదండలతో భారీగా నిర్వహించే సన్నాహాల్లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భారీగా నిర్వహించాలనే యోచనలో ఆయా పార్టీల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా.. పండుగ మూడు రోజులూ యథేచ్ఛగా కోడిపందేలను నిర్వహించారు. గతేడాది రూ.230 కోట్ల వరకూ చేతులు మారాయి. ఈ ఏడాది అంతకు మించి అన్నట్టుగా ఏర్పాట్లలో నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. అధికార పార్టీ నేతల సమక్షంలోనే ఈ పందేల నిర్వహణకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలను, కొందరు నేతలను నిర్వాహకులు కలిసి అన్ని రకాలుగా మద్దతు పొందినట్లు సమాచారం. బరులకు సంబంధించి భారీ మొత్తంలో మామూళ్లు కూడా సమర్పించేందుకు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట, తొండంగి, కరప, ఐ.పోలవరం, రాజోలు, సఖినేటిపల్లి, కొత్తపేట, అయినవిల్లి మండలాల్లో ఇప్పటికే బరులు ఏర్పాటు చేసే ప్రాంతాలను నిర్వాహకులు పరిశీలించారు. కొన్ని చోట్ల జంగిల్ క్లియరెన్స్ సైతం చేయించారు. ఆయా ప్రాంతాలకు ఎవరూ వెళ్లకుండా నిఘా పెట్టినట్టు సమాచారం. కోడిపందేలతో పాటూ గుండాట, పేకాట శిబిరాలను, అక్కడే మద్యం విక్రయాలు సైతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



గత ఏడాది కాకినాడ రూరల్ సర్పవరంలో ఏర్పాటు చేసిన బరి (ఫైల్)

రూ.కోట్లలో లావాదేవీలు

సంక్రాంతి పండగ మూడు రోజులూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కోడిపందేలు, గుండాటలు జోరుగా సాగనున్నాయి. గతేడాది ఒక్కో బరి వద్ద రోజుకు 20 రౌండ్లలో కోడి పందేలు జరిగాయి. ఒక్కో రౌండ్‌కు చిన్న బరుల్లో రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు, పెద్ద బరుల్లో రూ.ఐదు లక్షల నుంచి రూ.20 లక్షలు, రాష్ట్ర స్థాయి బరుల్లో రూ.50 లక్షల నుంచి రూ. రెండు కోట్లు చేతులు మారాయి. ఈ ఏడాది కూడా ఇదే మాదిరిగా చేతులు మారే అవకాశం కనిపిస్తుంది.

కోడి పుంజులకు గిరాకీ...

సంక్రాంతి నేపథ్యంలో కోడిపుంజులకు గిరాకీ ఏర్పడింది. ఏడాది కాలంగా పెంచిన పందెం పుంజులను అమ్ముకుంటూ కొంతమంది ఉపాధి పొందుతున్నారు. ఒక్కో పుంజు రూ. ఐదు వేల నుంచి రూ.50 వేల వరకూ పలుకుతోంది. రంగు, సైజులను బట్టి పుంజు ధరను నిర్ణయిస్తున్నారు. జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడు, కోనసీమలో లంక ప్రాంతాల్లో పుంజుల పెంపకానికి ప్రత్యేక ఏర్పాట్లు సైతం ముందుగానే చేసుకున్నారు.



సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చంద్రబాబును కలిసిన విజయానంద్ దంపతులు

ముఖ్యమంత్రి చంద్రబాబుతో నూతన సిఎస్ విజయానంద్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం సతీసమేతంగా ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన విజయనంద్.. తనను సిఎస్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

అనగాని సత్యప్రసాద్ హర్షం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విజయానంద్‌ను నియమించడం పట్ల రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర పాలనా యంత్రాంగంలో అత్యంత కీలక స్థానంలో బిసి వ్యక్తిని నియమించడం వారి పట్ల ముఖ్యమంత్రికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు బిసిలకు ఆ పదవి దక్కలేదని ప్రభుత్వ వర్గాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. రూ.75,760 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను గత వైసిపి ప్రభుత్వం దారి మళ్లించిందని, 8 వేల ఎకరాల బిసి అసైన్డ్ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుందని ఆరోపించారు.

అభినందనల వెల్లువ

రాష్ట్ర సచివాలయంలోని వివిధ విభాగాల అధిపతులతో పాటు పలువురు ఉన్నతాధికారులు విజయానంద్‌ను అభినందించారు. రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, టిటిడి ఇఒ శ్యామలరావు, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్, సిసిఎల్‌ఎ కమిషనర్ జయలక్ష్మి, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎం జానకి, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ తదితరులు విజయనంద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు సచివాలయ సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కూడా కలిసి అభినందనలు తెలిపారు. 1992 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన విజయానంద్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు.

సిఎస్‌ను కలిసిన ఎపి టిడిసి ఛైర్మన్ బాలాజీ

ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా నియమితులైన కె విజయానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యుత్ సౌధలోని విజయానంద్ కార్యాలయంలో మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. మొట్టమొదటిసారి వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తిని సిఎస్‌గా నియమించారని హర్షం వ్యక్తం చేశారు.

గీత కులాలకు మద్యం షాపులపై వారంలో నోటిఫికేషన్

- సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మద్యం షాపుల్లో గీత కులాలకు 10 శాతం కేటాయింపులకు సంబంధించి వారం రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులను సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. 340 షాపులను వారికి కేటాయించాలని ఆయన అన్నారు. మంగళవారం ఎక్సైజ్‌శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రం మొత్తం మీద 3396 మద్యం షాపులు ఉండగా, ఇందులో 10శాతం అంటే 340 షాపులు గీత కులాలకు కేటాయించినట్లు సిఎం వెల్లడించారు. మద్యం రిటైల్ షాపులకు ఇచ్చే మార్జిన్‌ను 10.5శాతం నుంచి 14శాతానికి పెంచేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బెల్ట్‌షాపుల విషయంలో కఠినంగా ఉండాలని ఆదేశించారు. హోలోగ్రామ్ ద్వారా ఎక్కడ తయారైన మద్యాన్ని ఎక్కడ అమ్ముతున్నారనేది కూడా తెలుసుకోవాలని, స్టాక్ వివరాలను తెలుసుకోవడంతో తప్పుజరిగితే చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. బెల్టుషాపులు నియంత్రణకు మద్యం వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు నవోదయం 2.0 పేరుతో జనవరి నుంచి ప్రత్యేక కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు అధికారులు సిఎంకు వివరించారు. ఈ సమీక్షలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆబ్కారీ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నాని

- హైకోర్టులో స్వల్ప ఊరట

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) సతీమణి జయసుధకు చెందిన గోదాములో బియ్యం మాయం కేసులో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. తాజాగా ఈ కేసులో నాని పేరును పోలీసులు రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ఆయనను అదుపులోకి తీసుకునేందుకు మంగళవారం పోలీసులు పేర్ని ఇంటికి వెళ్లారు. విషయం తెలిసిన వెంటనే ఆయన ఇంటి వద్ద లేకుండా తప్పించుకున్నారు. నానిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కేసు నేపథ్యంలో పేర్ని నాని హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి విచారణ జరిపారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు. అప్పటి వరకు నానిపై ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని ఆదేశించారు. దీంతో నానికి స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న జయసుధకు బందరులోని తొమ్మిదవ జిల్లా అదనపు జడ్జి కోర్టు కండిషన్ బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పౌరసరఫరాల సంస్థ టెక్నికల్ మేనేజర్ కోటిరెడ్డి, గోదాము మేనేజర్ మానసతేజ, రైస్ మిల్లర్ బొర్రా అంజనేయులు, లారీ డ్రైవర్ బోట్ల మంగారావులను నిందితులుగా చేర్చారు. వారిని సోమవారం రాత్రి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి 12 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పోలీసులు బందరు సబ్ జైలుకు తరలించారు.



అనంతపురం జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

'అనంత'లో రెండోరోజు కొనసాగిన న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

న్యాయవాది శేషాద్రి మరణానికి కారణమైన అనంతపురం త్రీటౌన్ సిఐ కె.శాంతిలాల్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ న్యాయవాదులు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. రెండు రోజులుగా న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది రామలింగారెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు సివిల్ తగాదాల విషయంలో జోక్యం చేసుకోరాదని పలు సందర్భాల్లో హైకోర్టు, సుప్రీంకోర్టులు తీర్పు వెలువరించాయన్నారు. అయినా కొందరు పోలీసులు సివిల్ తగదాల్లో జోక్యం చేసుకుంటున్నారని తెలిపారు. త్రీటౌన్ సిఐ శాంతిలాల్... ఓ న్యాయవాదిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి బెదిరించడం వల్లే గుండెపోటుకు గురై మరణించారని అన్నారు. న్యాయవాది మృతికి పోలీసుల బెదిరింపులే కారణమన్నారు. ఇందుకు బాధ్యులైన పోలీసు అధికారులందరినీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు ఉన్నతాధికారులు దీనిపై స్పందించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బడ నారాయణరెడ్డి, వెంకటరాముడు, అవ్వ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వాసంశెట్టిపై కేసుల విచారణ నిలిపివేత

ప్రజాశక్తి-అమరావతి



కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌పై అమలాపురం మెజిస్ట్రేట్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న రెండు కేసుల్లో తదుపరి చర్యలను హైకోర్టు 12 వారాలపాటు నిలిపివేసింది. ఈ మేరకు మంగళవాం జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించారని అమలాపురం పట్టణ పోలీస్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు 2015 ఫిబ్రవరిలో సుభాష్‌పై కేసు నమోదైంది. ఆ కేసు ఇప్పుడు అమలాపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు చేరింది. ఇదే మాదిరి మానవ హక్కుల సంఘంలో ఉద్యోగాల పేరుతో సుభాష్ పలువురిని మోసం చేశారనే ఫిర్యాదు ఆధారంగా మరో కేసు నమోదైంది. ఆ రెండు చార్జిషీట్లను కొట్టేయాలన్న పిటిషన్లపై విచారణ ఫిబ్రవరి 25కు వాయిదా పడింది.

కేసు నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి-అమరావతి

అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరు నగరపాలెం పిఎస్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ గుంటూరు ప్రభుత్వాస్పత్రి గత సూపరింటెండెంట్ నీలం ప్రభావతి వేసిన కేసు విచారణ నుంచి జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి తప్పుకున్నారు. తనను పోలీసులు చిత్రహింసలకు గురిచేసిన తర్వాత మెడికల్ పరీక్షలప్పుడు గాయాలు ఏమీ లేవని నివేదిక ఇచ్చారంటూ ఆమెపై రఘురామ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆమె పిటిషన్ వేశారు.

మాజీ ఎమ్మెల్యేలకు ఊరట

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా పోస్టులకు చెందిన కేసులో మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. 'రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలి. చార్జిషీట్ వేసే వరకు వారంలో ఒకరోజు దర్యాప్తు అధికారిని కలవాలి' అని జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం షరతులతో కూడిన ఉత్తర్వులు జారీ చేశారు. సహ నిందితుల వాంగ్మూలం మేరకు పిటిషనర్‌పై కేసు నమోదు చేయడాన్ని ఆక్షేపించారు. ధూళిపాళ్ల కుటుంబ సభ్యులకు వ్యతిరేకంగా రోశయ్య పోస్టులు పెట్టినట్లుగా ఆధారాలు పోలీసులు చూపలేదన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర భార్య జ్యోతిర్మయి 2020 జనవరి 22న చేసిన ఫిర్యాదు మేరకు గోపీ లాల్‌పై కేసు నమోదు చేశారు. పోలీసులు కిలారి రోశయ్యను నిందితుడిగా చేయడంతో ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారు. వాట్సాప్ గ్రూపులో మెసేజ్లు పెట్టడం ఫోర్జరీ కిందకు ఎలా వస్తుందని ఆయన న్యాయవాది వాదించారు. ఫిర్యాదుదారు కుమార్తె ఫొటోలను కిలారి రోశయ్యే పోస్టు చేశారని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇదే కేసులో రోశయ్యతోపాటు మరో 8 మందికి ముందస్తు బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. వైసిపికి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు హైకోర్టులో ఊరట లభించింది. కింది కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి ఆయనకు మినహాయింపునిచ్చింది. ఫిర్యాదుదారు ఎల్ కామేసుకు నోటీసులు జారీ చేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ శిలాఫలకాన్ని, వైఎస్ఆర్ నామ ఫలకాన్ని టిడిపి నేతలు తీసేశారంటూ అప్పలరాజు మీడియా సమావేశంలో విమర్శించారు. దీనిపై కాశీబుగ్గ టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేసు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కాశీబుగ్గ పోలీసులు అప్పలరాజుపై కేసు నమోదు చేశారు. ఇది పలాస, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుకు చేరింది. ఆ కేసు విచారణ నుంచి మినహాయింపు ఇవ్వాలని అప్పలరాజు పిటిషన్‌పై ఉత్తర్వులు వెలువడ్డాయి.

రక్షణ దళాల సిబ్బంది శిక్షణకు 'గీతం' సహకారం

ప్రజాశక్తి -మధురవాడ : దేశ రక్షణ దళాలలో ప్రస్తుతం పనిచేస్తున్న, ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ కోర్సులలో ప్రత్యేక శిక్షణ అందించడానికి ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్, పశ్చిమబెంగాల్‌కు చెందిన రాజ్య సైనిక్ బోర్డు (ఆర్ఎస్‌బి)లతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు మంగళవారం గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కల్నల్ సమీర్ శర్మ, పశ్చిమబెంగాల్ రాజ్య సైనిక్ బోర్డు కార్యదర్శి కల్నల్ పార్థ ప్రతిమ్ బారిక్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు.

మాజీ ఎంపి భరత్‌ను అరెస్టు చేయొద్దు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి



రాజమండ్రి మాజీ ఎంపి, వైసిపి నేత మార్గాని భరత్‌ను అరెస్టు చేయొద్దని రాజమండ్రి త్రీటౌన్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆయనపై ఉన్న కేసులో దర్యాప్తును కొనసాగించుకోవచ్చునని చెప్పింది. ఫిర్యాదుదారు చాపల రాజుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 3వ వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మార్గాని భరత్ రాష్ట్రాన్ని, రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా పోస్టులు పెట్టారని రాజు గతేడాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రాజమండ్రి త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేయడంతో భరత్ హైకోర్టును ఆశ్రయించారు.

48 గంటలకు ముందుగా నోటీసులు

సోషల్ మీడియా పోస్టుల కేసులో కడప ఎంపి అవినాష్‌రెడ్డి పిఎస్ బండి రాఘవరెడ్డిని నిందితునిగా చేర్చితే ఆయనకు 48 గంటలు ముందుగా నోటీసు ఇవ్వాలని అన్నమయ్య జిల్లా, మున్నూర్ పోలీసులకు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆదేశించారు. ఆ కేసులో నిందితుడిని కాదని, రవీందర్‌రెడ్డి వాంగ్మూలం ఆధారంగా తనపై కేసు నమోదుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రాఘవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

అక్రిడేషన్ల కాల పరిమితి పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగిసిన నేపథ్యంలో ఆ కార్డుల కాలపరిమితిని రెండు నెలల పాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌరసంబంధాలశాఖ తెలిపింది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ, ఏది ముందు జరిగితే అప్పటి వరకు కార్డులు చెల్లుబాటు అవుతాయని ఉత్తర్వులిస్తున్నట్లు సమాచార కమిషనరు హిమాన్షుశుక్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 డిసెంబరు 31 నాటికి అక్రిడేషన్ కార్డులు కలిగి, పనిచేస్తున్న జర్నలిస్టులకు మాత్రమే ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు.

గోవా ముఖ్యమంత్రితో కొమ్మారెడ్డి భేటీ

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరూ రాష్ట్ర పరిస్థితులపై చర్చించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉంది? పాలనలో నూతన సంస్కరణలు ఏమైనా తీసుకొచ్చారా? వైసిపి పనితీరు ఎలా ఉంది? వంటి తదితర విషయాల గురించి చర్చించినట్లు సమాచారం.

మామిడికి మంచు దెబ్బ

- పూతకు పక్షి కన్ను, బూడిద, మసి తెగుళ్లు
- ఎకరాకు అదనంగా రూ.నాలుగు వేల ఖర్చు
- దిగుబడులపై తీవ్ర పభావం
- జీడి మామిడి రైతులకూ కష్టకాలం



శంఖవరం మండలంలో తెగుళ్లు చోకిన మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మామిడి, జీడి మామిడి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. మంచు, వర్షాలు కురుస్తుండడంతో పంటను చీడపీడలు ఆశిస్తున్నాయి. దీంతో పూత మాడిపోయి రాలిపోతోంది. ఈ ప్రభావం దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో తుని, శంఖవరం, ప్రత్తిపాడు, కోరుకొండ, జగ్గంపేట, రాజానగరం, గండేపల్లి, రౌతులపూడి, తొండంగి, కోటనందూరు తదితర మండలాల్లో మామిడి, జీడి మామిడి ఎక్కువగా సాగవుతోంది. ఈ రెండు జిల్లాల్లో మామిడి 29,252 ఎకరాల్లో, జీడి మామిడి 47,163 ఎకరాల్లో సాగులో ఉన్నాయి. 38,300 మంది రైతులు ఈ తోటలను సాగు చేస్తున్నారు. ఏటా దాదాపు 70 వేల మెట్రిక్ టన్నుల మామిడి పండ్లు, సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల జీడిమామిడి దిగుబడి వస్తుంది.

రాత్రి వేళల్లో కురుస్తున్న మంచు, వరుస అల్పపీడనాలు, తుపాన్లతో మామిడి, జీడి మామిడి పంటలకు తెగుళ్లు సోకుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మామిడికి తేనెమంచుతో మొగ్గ తొలుచు పురుగులు, పక్షి కన్ను, బూడిద, మసి తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయి. దీంతో పూత మాడిపోయి రాలిపోతోంది. వీటి నివారణకు పురుగు మందుల పిచికారీకి రైతులు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. జిల్లాలో పది రోజులుగా మబ్బుపట్టి ఉండడంతో తెగుళు మరింత ఉధృతమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా మామిడి తోటలో ఫలసాయం తీసేందుకు రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. ప్రస్తుతం తెగుళ్ల నేపథ్యంలో ఎకరాకు అదనంగా రూ.నాలుగు వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి పెరుగుతోంది



మా కుటుంబ సభ్యులందరం కలిసి ఎనిమిది ఎకరాల్లో మామిడి, జీడి మామిడి తోటలను సాగు చేస్తున్నాం. అల్పపీడనం ప్రభావానికి తోడు మంచు అధికంగా కురుస్తోంది. దీంతో పూతకు తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తున్నాయి. పిచికారీకే పెట్టుబడులు అధికంగా అవుతున్నాయి.

- కె.సత్యనారాయణ, మామిడి రైతు, బలరామపురం, రౌతులపూడి మండలం

నివారణ చర్యలు అవసరం

మామిడి, జీడిమామిడిలో తెగుళ్లను అదుపు చేయడానికి నివారణా చర్యలు చేపడితే సత్ఫలితాలు వస్తాయి. క్లోరిఫైరిపాస్ 50 ఇసి ఒక మిల్లీలీటరు లేదా లాన్డ సైహలోత్రిక్ ఒక మిల్లీ లీటరు లేదా సైపనోటోరం ఒక మిల్లీ లీటరు, క్లోరోథలోనిత్ రెండు మిల్లీ లీటర్లు గాని నల్ల గంథం మూడు గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం వస్తుంది. పచ్చిపూత దశలో సకాలంలో మందులను పిచికారీ చేసుకోవాలి.

- ఎన్.మల్లికార్జునరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, కాకినాడ



విజయవాడలో నిరసన ర్యాలీలో పాల్గొన్న దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు

అమిత్‌షా రాజీనామా చేయాలని నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-విజయవాడ

పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానపరుస్తూ అహంకారంగా మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విజయవాడలో నిరసన ప్రదర్శన చేపట్టారు. దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ప్రదర్శన తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దగల అంబేద్కర్ విగ్రహం నుంచి బందరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్ మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షాను దేశ బహిష్కరణ చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేసి శిక్షించాలని, అమిత్ షా వ్యాఖ్యలను సమర్థించిన ప్రధాని మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఖండించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రదర్శనలో కెవిపిఎస్, బిఎస్‌పి, ఆప్, జై భీమ్ యాక్సెస్ జస్టిస్ పార్టీ, విద్యార్థి, యువజన, ఉద్యోగ, కార్మిక, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిఎస్‌టి చెల్లింపునకు ముఖ ఆధారిత గుర్తింపు

- నేటి నుంచి అమలు
- సేల్స్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ బాబు.ఎ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) చెల్లింపుదారులకు బమోమెట్రిక్ ఫేస్ అథెంటికేషన్ (ముఖ ఆధారిత గుర్తింపు) సదుపాయాన్ని అమల్లోకి తెస్తున్నట్లు వాణిజ్య పన్నులశాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఎ తెలిపారు. ఈ సదుపాయం 2025 జనవరి ఒకటి నుంచి అమల్లోకి వస్తుందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ధ్రువీకరణకు సంబంధించిన పరిశీలన ప్రక్రియ క్రమబద్ధీకరణ, జిఎస్‌టి రిజిస్ట్రేషన్ దశలోనే నకిలీ చెల్లింపుదారులను గుర్తించి వారిని నిరోధించాలనే ఉద్దేశంతో ఈ సదుపాయాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)తో దుర్వినియోగాలకు పాల్పడేవారిని నిరోధించడమే ఫేస్ అథెంటికేషన్ లక్ష్యమన్నారు. అదే విధంగా పన్ను చెల్లింపుదారుల ఆధార్ వివరాలను దుర్వినియోగం చేయకుండా, నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించకుండా కొత్త విధానంలోని భద్రతా వ్యవస్థ రక్షణ కల్పిస్తుందని తెలిపారు. అమాయకులైన వ్యక్తులకు సంబంధించి ఆధార్ వివరాలను వేరొకరు దుర్వినియోగం చేయకుండా కాపాడటంతోపాటు, చట్టబద్ధమైన పన్ను చెల్లింపుదారులు మాత్రమే ఈ విధానంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని పన్ను చెల్లించేందుకు భరోసా కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 12 జిఎస్‌టి సేవా కేంద్రాల్లో పన్ను చెల్లింపుదారుల వేలిముద్రలు లేక ఐరిస్ స్కాన్‌ను ఉపయోగించి బయోమెట్రిక్ అథెంటికేషన్‌ను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు మరింత సులభంగా, అందుబాటులో ఉండేలా జిఎస్‌టిఎస్ మొబైల్ యాప్ అభివృద్ధి చేసిందని, ఈ కొత్త యాప్ జిఎస్‌టి కేంద్రాల్లో బయోమెట్రిక్ అథెంటికేషన్ అధికారులు (బిఎఒ) ఇకపై ఎలాంటి హార్డ్‌వేర్ డివైజ్‌ల అవసరం లేకుండా పరిశీలన ప్రక్రియను పూర్తి చేసేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ యాప్‌లో బిఎఒలు లాగిన్ అయి ఆధార్ వివరాలను నమోదు చేయడంతోపాటు, ఫేస్ అథెంటికేషన్, పరిశీలన కోసం ఫొటో తీసుకోవడం వంటి ప్రక్రియనంతా ఒకేసారి నిర్వహించే సౌలభ్యం ఉందని తెలిపారు. గతంలో ఉన్న విధానంలో బయోమెట్రిక్ పరిశీలన ప్రక్రియ మూడు దశలుగా కొనసాగేదని, ప్రస్తుత విధానంలో కేవలం రెండు దశల్లోనే పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఫొటో క్యాప్చర్, ఫేస్ అథెంటికేషన్ ఒకటి కాగా, పత్రాల ధ్రువీకరణ రెండో దశగా పేర్కొన్నారు.

పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో రైల్వే మెయిల్ సర్వీస్ విభాగాలను కొనసాగించాలి

- ఎపి రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఆర్‌ఎమ్‌ఎస్ (రైల్వే మెయిల్ సర్వీస్) విభాగాలను కొనసాగించాలని, ఆర్‌ఎమ్‌ఎస్‌లను ఎత్తివేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని, అన్ని సంఘాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని ఎపి రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) మంగళవారం పిలుపునిచ్చింది. గుంతకల్లు పట్టణంలో చేస్తున్న రిలే దీక్షలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా వివిఎల్ నరసింహులు, గుంతకల్లు సిఐటియు కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవలనే దేశ వ్యాప్తంగా 310కి పైగా ఆర్‌ఎమ్‌ఎస్ విభాగాలను మూసివేయాలని నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, కేంద్ర ప్రభుత్వ శాఖలు , రైల్వేలను బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరించి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్న ప్రక్రియలో భాగంగానే ఆర్‌ఎంఎస్‌లను కూడా మూసివేయడంవల్ల ప్రజలు పొందుతున్న పోస్టల్ సేవలు ఇకపై అతి భారంగా ఉంటాయన్నారు. ఆర్‌ఎంఎస్‌లను మూసే విధానానికి వ్యతిరేకంగా ఆర్‌ఎంఎస్‌లను కొనసాగించాలని ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చేందుకు ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడాలని, ఆర్‌ఎంఎస్ ఉద్యోగ సంఘాలు చేస్తున్న పోరాటానికి సిఐటియు మద్దతు తెలుపుతున్నట్లు నరసింహులు పేర్కొన్నారు.

ఉజ్బెకిస్తాన్‌లో చిక్కుకున్న సిక్కోలు యువకులు

- స్వదేశానికి తీసుకురావాలని విన్నపాలు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు



ఉజ్బెకిస్తాన్‌లో ఇబ్బందులు పడుతున్న యువకులు

నకిలీ ఏజెంట్లు మోసం చేయడంతో దేశం కాని దేశంలో శ్రీకాకుళం జిల్లా యువకులు నానాతిప్పలు పడుతున్నారు. మూడు నెలలుగా సరైన తిండి లేక, చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన చెందుతూ ఓ వీడియో సందేశాన్ని పంపించారు. తమను స్వదేశానికి తీసుకొచ్చేందుకు సహకరించాలని వేడుకుంటున్నారు. వజ్రపుకొత్తూరు మండలం పెద్ద మురహరిపురం, చిన్న మురహరిపురం, రామకృష్ణాపురం, చిన్న పల్లివూరు, అమలపాడు, సంతబొమ్మాళి మండలం భావనపాడు, నందిగాం మండలానికి చెందిన జీవన్, చింత హేమారావు, రాజాం మహేష్, నందిగాం శ్రీను, గర్తం జోగారావు, గొరకల షణ్ముఖరావు, శంకరరావును పల్లిపూరు, భావనపాడు చెందిన ఏజెంట్లు విదేశాల్లో ఉద్యోగాలు ఉన్నాయని నమ్మించి, వారి నుంచి డబ్బులు తీసుకుని ఉజ్బెకిస్తాన్ పంపించారు. అక్కడకు చేరుకున్న తర్వాత లాడ్జీలో ఉంచిన ఏజెంట్లు, సరైన తిండి కూడా పెట్టకుండా నానా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. తమకు కంపెనీలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతున్నా, వారి నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. తమను స్వదేశానికి పంపించాలని డిమాండ్ చేస్తే, లాడ్జీ నుంచి బయటకు పంపించారని వాపోయారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోయామని గ్రహించిన వారు స్వదేశానికి తీసుకొచ్చేలా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని స్థానిక నాయకులకు వీడియోను, ఫొటోలను పంపించారు.

బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటు చేయొద్దు

- రాజయ్యపేట తీరంలో వినూత్న నిరసన

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)



రాజయ్యపేట తీరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మత్స్యకారులు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని వైజాగ్ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూమిలో బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటు చేయొద్దంటూ మంగళవారం రాజయ్యపేట సముద్ర తీరంలో సిపిఎం నాయకులు, మత్స్యకారులు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఇసుక పోగు వేసి ప్రమాదకరమైన బల్క్ డ్రగ్స్ పార్కును తమ ప్రాంతంలో ఏర్పాటు చేయొద్దని దానిపైన రాసి పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్ మాట్లాడారు.

రాజయ్యపేట ప్రాంతంలో 1800 ఎకరాల్లో బల్క్ డ్రగ్స్ పార్కును ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా అధికారులు, పోలీసులు మోహరించి కారిడార్ ప్రాంతంలో పనులు చేపడుతున్నారని వివరించారు. విదేశాల్లో నిషేధించిన బల్క్ డ్రగ్స్ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేయవద్దని, ఇప్పటికే ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ విడుదల చేస్తున్న వ్యర్థ రసాయన జలాల వల్ల మత్స్య సంపద నశించిపోయి ఎంతోమంది ఉపాధి కోల్పోయారని, అనారోగ్యాల బారిన పడ్డారని తెలిపారు. పలువురు మృత్యువాతపడిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మరింత ప్రమాదకరమైన బల్క్ డ్రగ్స్ పార్కును ఈ ప్రాంతంలో పెట్టొద్దని డిమాండ్ చేశారు. ఇప్పటికే భూములు కోల్పోయిన రైతులకు, కార్మికులకు, దళితులకు, సముద్రమే జీవనాధారంగా జీవిస్తున్న మత్స్యకారులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లించాలని, సాగు భూములకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుండా జనవరి ఎనిమిదిన ప్రధాని మోడీ బల్క్ డ్రగ్స్, ఆర్సిలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన ఏ విధంగా చేయిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్.సోమేష్, ఎం.భయ్యన్న, సిహెచ్.రాజు, ఎం.జాన్, బి.అప్పలరాజు, మత్స్యకారులు పాల్గొన్నారు.



తెలుగు ఔత్సాహికవేత్తలకు 'అప్తా' మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆసక్తి కలిగిన ఔత్సాహికవేత్తలకు దేశ, విదేశాల్లోని విస్తృత వ్యాపార అవకాశాలు, ఐడియా లపై అవగాహన కల్పిస్తామని అమెరి కన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (అప్తా) సభ్యులు వెల్లడించారు. కొత్త ఏడాదిలో హైదరాబాద్‌లో అతిపెద్ద అతిపెద్ద తెలుగు ఎన్నారైల గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. హైటెక్స్‌లో జనవరి 3 నుంచి 5వ తేదిల్లో అప్తా కాటలిస్టు 2025ను ఏర్పాటు చేస్తుందన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో అప్తా కాటలిస్ట్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ సుబ్బు కోట, కన్వీనర్ సాగర్ లాగిసెట్టి, సెక్రటరీ చంద్ర శేఖర్ నల్లమ్, ట్రెజరర్ తేజ్ పక్యాలా, అప్తా ప్రెసిడెంట్ మధు వుల్లి, ఆ సంస్థ ప్రతినిధులు రమేష్ తూము, వినయ్ వెలివెలా తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. తొలి రోజు 3న జరిగే సమావేశానికి ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, రెండో రోజు తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ముగింపు వేడుకకు మెగాస్టార్ చిరంజీవి హాజరు కానున్నారని తెలిపారు. ఈ మూడు రోజుల సదస్సులో నాలెడ్జ్ షేరింగ్, మెంటరింగ్, నెట్‌వర్కింగ్, భాగస్వామ్య సహకారాలు, స్టార్టప్ ఎకోసిస్టమ్ తదితర వాటిపై అవగాహన, మద్దతును అందించనున్నామన్నారు.

దీనికి భారత్ సహా ఉత్తర అమెరికా, యూరప్, మిడిల్ ఈస్ట్ మరియు ఆసియాతో సహా 20 దేశాల నుండి వేలాది మంది భారతీయ సంతతికి చెందిన 1000కి పైగా పారిశ్రామికవేత్తలు హాజరు కానున్నారని తెలిపారు. ఐటి, విద్యా, వైద్యం, రియల్ ఎస్టేట్, పర్యాటకం, తయారీ తదితర రంగాల్లోని వ్యాపార అవకాశాలపై 42పైగా ప్యానెల్స్ చర్చించనున్నాయన్నారు. లాభాపేక్ష లేని తమ సంస్థ ఇప్పటి వరకు 12వేల పైగా భారత విద్యార్థులకు రూ.14 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను అందించామన్నారు.

విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనలపై 7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

- ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనలపై జనవరి ఏడు నుంచి ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏడు, ఎనిమిది, పది తేదీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా మండలి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏడు, ఎనిమిది తేదీల్లో విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్ సెంటర్‌లో, పదిన కర్నూలులోని రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని తెలిపారు. మూడు రోజుల్లోనూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నేరుగానూ, తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 వరకూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినియోగదారులు, అభ్యంతరదారులు తమ సూచనలు, అభ్యంతరాలను వెల్లడించవచ్చని పేర్కొన్నారు. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ (ఇన్‌ఛార్జ్) ఠాకూర్ రామ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం ద్వారా అభ్యంతరదారులు తమకు సమీపంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయాల నుంచి గాని, లేదా డివిజనల్ కార్యాలయాల నుంచి గాని పాల్గొని, టారిఫ్ ప్రతిపాదనలపై సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియజేయవచ్చని తెలిపారు.

కుల సర్వే అభ్యంతరాల గడువు జనవరి 7 వరకు పొడిగింపు

- సాంఘిక సంక్షేమ శాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కుల సర్వే (షెడ్యూల్డ్ కులాలు) వివరాలపై అభ్యంతరాలను స్వీకరించడానికి ఈనెల31చివరి తేదీ కాగా, గడువును జనవరి 7వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని సాంఘిక సంక్షేమ శాఖ పేర్కొంది. తుది జాబితా జనవరి 10న ప్రకటించాల్సి ఉండగా, ఆ తేదీని జనవరి 17కు మార్చాలని నిర్ణయించినట్లు ఆ శాఖ తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

పెరిగిన బంగారం రుణ ఎన్‌పిఎలు

- తాకట్టు పసిడిని విడిపించుకోలేని పరిస్థితులు
- ఆదాయాల్లో తగ్గుదల ప్రభావం
- ఆర్థిక వ్యవస్థలో మందగమనం



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడం, ఆదాయాలు తగ్గడం, అప్పులు పెరగడంతో బంగారం రుణాల్లో భారీగా మొండి బాకీలు పెరుగుతున్నాయి. మరోవైపు తాకట్టు పెట్టిన బంగారం వేలానికి వస్తోంది. గతేడాది 2024 ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థ (ఎన్‌బిఎఫ్‌సి)ల పసిడి రుణాల నిరర్థక ఆస్తులు 30 శాతం ఎగిసి రూ.6,696 కోట్లకు చేరాయి. ఇంతక్రితం మార్చి ముగింపు నాటికి రూ.5,149 కోట్ల నిరర్థక ఆస్తులు చోటు చేసుకున్నాయి. ఆర్‌బిఐ గణంకాల ప్రకారం.. 2022-23లో బంగారం రుణాల జారీలో 14.6 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు సమాచార హక్కు చట్టం కింద ఆర్‌బిఐ ఇచ్చిన వివరాల మేరకు.. 2024 జూన్ ముగింపు నాటికి వాణిజ్య బ్యాంక్‌ల బంగారం రుణాల ఎన్‌పిఎలు రూ.2,445 కోట్లకు చేరాయి. 2024 మార్చి నాటికి రూ.1,513 కోట్ల ఎన్‌పిఎలు నమోదయ్యాయి. ఇదే సమయంలో ఎన్‌బిఎఫ్‌సిల పసిడి రుణ ఎన్‌పిఎలు 3,636 కోట్లుగా ఉండగా.. జూన్ ముగింపు నాటికి రూ.2,445 కోట్లకు చేరాయి. బంగారం రుణాలు తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలం కావడమే ఇందుకు ప్రధాన కారణం.

ఆర్థిక వ్యవస్థ మందగించడం ఆదాయ స్థాయిలను ప్రభావితం చేయడంతో ఖాతాదారులు తిరిగి చెల్లించడం కష్టతరంగా మారడంతో బంగారం రుణాల డిఫాల్ట్‌లు పెరుగుతున్నాయని ఆ పరిశ్రమ వర్గాల అంచనా. బంగారం ధరలు పెరగడంతోనూ ప్రజలు ఇంటి ఖర్చులు, పాఠశాల, విద్య ఫీజులు, వైద్య అవసరాల కోసం తమ బంగారాన్ని తాకట్టు పెట్టారు. అక్టోబర్ 2024 నాటికి బ్యాంకుల్లో బంగారం రుణాలు రూ.1,54,282 కోట్లకు పెరిగాయి. మార్చి 2024 నాటికి రూ.1,02,562 కోట్లుగా నమోదయ్యాయి. బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిల బంగారు రుణ పుస్తకం కలిపి రూ.3 లక్షల కోట్ల మార్కును దాటినట్లు అంచనా.

23 శాతం పెరిగిన బంగారం ధర

గడిచిన ఏడాది 2024లో బంగారం ధరలు 23 శాతం పెరిగాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యాక జాతీయంగా, అంతర్జాతీయంగా బంగారం ధరలు కొంత దిగి వచ్చాయి. 2025లో తులం బంగారం ధర రూ.90 వేలకు చేరుతుందని బులియన్ మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక రంగంలో ఒడిదొడుకులు ఇలాగే కొనసాగడంతోపాటు అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం వంటి కారణాలతో 2025లో దేశీయ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.85 వేల నుంచి రూ.90 వేల వరకూ చేరొచ్చని అంచనా. ప్రస్తుతం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.79,350గా ఉంది. 2024 జనవరి ఒకటో తేదీన తులం బంగారం ధర రూ.63,870 పలికింది. నాటి నుంచి ఇప్పటి వరకూ బంగారం ధర 23 శాతం పెరిగింది. అక్టోబర్ 30న తులం బంగారం ధర రూ.82,400కి చేరి జీవిత కాల గరిష్టాన్ని తాకింది.

ఆగని రూపాయి పతనం

- డాలర్@85.65



ముంబయి : ప్రపంచ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ పతనం కొనసాగుతోంది. 2024 చివరి రోజూ మరింత క్షీణించి నూతన కనిష్టాన్ని చవి చూసింది. మంగళవారం అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ 13 పైసలు పతనమై 85.65 కనిష్ట స్థాయికి దిగజారింది. భారత కరెన్సీ చరిత్రలోనే ఇది మరో అత్యంత కనిష్టం. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 85.54 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో ఏకంగా 85.66 రికార్డ్ కనిష్ట స్థాయిని తాకింది. డిసెంబర్ నెల చివరి రోజులు కావడంతో ఫారెక్స్ ట్రేడర్లు తమ చెల్లింపుల డిమాండ్‌ను చేరుకోవడానికి డాలర్ల కొనుగోళ్లకు మొగ్గు చూపారని సమాచారం. దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణంకాలు, స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, పేలవ ఎగుమతుల తీరు, దిగుమతులు పెరగడం తదితర అంశాలు రూపాయి విలువను రోజురోజుకు క్షీణించేలా చేస్తున్నాయి.

గతేడాది మార్కెట్‌లో 8 శాతం రాబడులు

2024 చివరి రోజు నష్టాలు

ముంబయి : గతేడాది 2024లో భారత స్టాక్ మార్కెట్లు 8 శాతంగా పైగా రాబడులను అందించాయి. సెన్సెక్స్ 5,898.75 పాయింట్లు లేదా 8.16 శాతం పెరిగింది. ఎన్‌ఎస్ఇ నిఫ్టీ 1,913 పాయింట్లు లేదా 8.80 శాతం లాభపడింది. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ రికార్డ్ స్థాయిలో 85,978 మార్క్‌ను తాకాగా.. నిఫ్టీ 26,277 గరిష్ట స్థాయిని నమోదు చేసింది. ఏడాది చివరి రోజు మంగళవారం స్వల్ప నష్టాలను చవి చూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఐటితోపాటు కొన్ని బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ 109.12 పాయింట్ల నష్టంతో 78,139కు పరిమితమయ్యింది. ఎన్‌ఎస్ఇ నిఫ్టీ 0.10 పాయింట్లు తగ్గి 23,644.80 వద్ద ముగిసింది. ఇంతక్రితం సోమవారం సెషన్‌లో సెన్సెక్స్ 450 పాయింట్లు, నిఫ్టీ 168 పాయింట్ల చొప్పున పతనమయ్యాయి.

అదానీ విల్మార్ షేర్ 8 శాతం పతనం

అదానీ విల్మర్ నుంచి అదానీ గ్రూప్ వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో మంగళవారం ఇంట్రాడేలో అదానీ విల్మార్ షేర్లు దాదాపు ఎనిమిది శాతం పతనమైంది. బిఎస్ఇలో తుదకు 6.45 శాతం నష్టంతో రూ.308.25 వద్ద ముగిసింది. ఈ ఎఫ్ఎంసిజి జాయింట్ వెంచర్ అదానీ విల్మార్ నుంచి వైదొలుగుతున్నట్లు సోమవారం అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రకటించిన విషయం తెలిసిందే.



రిలయన్స్ కెజి చమురుకు ప్రీమియం ధర

- బిడ్డింగ్‌లకు అహ్వానం

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ కెజి బేసిన్‌లో ఉత్పత్తి చేసే ముడి చమురుకు ప్రీమియం ధరను డిమాండ్ చేస్తోంది. ఇందుకోసం బిడ్లను అహ్వానిస్తోంది. దీంతో బిడ్డర్లు అంతర్జాతీయ బెంచ్‌మార్క్ కన్నా కనీసం 3.5 డాలర్లు అధికంగా కోట్ చేయాల్సి ఉంటుంది. 2025 జనవరి 24 నాటికి బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు ప్రతి నెలా ఉత్పత్తి చేసే 17,600 బ్యారెళ్ల ఆయిల్ విక్రయం కోసం తాజాగా బిడ్లను ఆహ్వానించింది. ప్రస్తుతం క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 73.5 డాలర్లుగా ఉంది. టెండరు ప్రకటన ప్రకారం దీనికి 1.5 డాలర్ల ప్రీమియంతో పాటు బ్యారెల్‌కు కనీసం 2 డాలర్లు అధికంగా బిడ్డర్లు కోట్ చేయాల్సి ఉంటుంది. తూర్పు గోదావరి జిల్లాలోని గాడిమొగ నుంచి ఈ ఆయిల్‌ను రిలయన్స్ సరఫరా చేస్తుంది. కెజి బేసిన్‌లో రిలయన్స్‌కు 66.67 శాతం, బ్రిటిష్ పెట్రోలియంకు 33.33 శాతం చొప్పున వాటాలున్నాయి.

సంపాదకీయం

మహమ్మారి క్షయ!

క్షయ మహమ్మారి వటవృక్షంలా విస్తరిస్తున్నదని, 26 శాతం కేసులు, మరణాలతో ప్రపంచంలోనే అగ్రస్థానంలో భారత్ ఉందన్న విషయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2015-25 మధ్య 50 శాతం కేసులు తగ్గిస్తామంటూ మన దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలు 18 శాతానికే పరిమితమై పోయాయి. ప్రపంచ టిబి నివేదిక (గ్లోబల్ ట్యుబర్క్యులోసిస్ రిపోర్ట్) 2024 ప్రకారం 2023లో నమోదైన మొత్తం 82 లక్షల టిబి కొత్త కేసుల్లో 56 శాతం ఐదు దేశాల్లోనే నమోదయ్యాయి. ఇండోనేషియాలో పది శాతం, చైనా, ఫిలిప్పైన్స్‌లో 6.8 శాతం, పాకిస్థాన్‌లో 6.3 శాతం కేసులు నమోదయ్యాయి. 2023లో ప్రపంచవ్యాప్తంగా 12.5 లక్షల మంది మరణిస్తే, వారిలో 3.15 లక్షల మంది భారతీయులే. 12 శాతం కేసులు చిన్నారులు, యువతలోనే నమోదవడం మరింత ఆందోళనకరం. టిబి తిరగబెట్టడం గత ఏడాది మరింతగా పెరిగి, ప్రజారోగ్య సంక్షోభంగా తయారైంది. ఇంత పెద్దఎత్తున క్షయ విస్తరిస్తున్నా... 'టిబి ఫ్రీ ఇండియా' అంటూ ప్రకటనలు చేయడం మినహా.. కేంద్రం చిత్తశుద్ధితో అడుగు ముందుకేయడం లేదు.

టిబి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిన 1960ల నుంచి 2023లో నమోదైన కేసులే అత్యధికం. 27 లక్షల టిబి కేసులు నమోదైతే, 25.1 లక్షల మంది మందులు వాడుతున్నారు. గత ఎనిమిదేళ్లలో మిగతా దేశాల్లో ఎనిమిది శాతం కేసులు తగ్గితే, మన దేశంలో 18 శాతం తగ్గాయంటూ గొప్పలు చెప్పుకుంటున్న కేంద్రం ప్రపంచంలోనే ఎందుకు తొలి స్థానంలో ఉన్నామో సమాధానం చెప్పాలి. 2030 నాటికి టిబిని నిర్మూలించాలని ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు నిర్దేశిస్తుండగా, 2025 నాటికే నిర్మూలిస్తామన్న హామీకి అనుగుణంగా నిధులు కేటాయిస్తున్నామా? అనేది కేంద్ర సర్కారు సమీక్షించుకోవాలి. అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నాణ్యత గల ఔషధాలు, పౌష్టికాహారం అందించడం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో ముఖ్యాంశం. 2019లో 346 మిలియన్ డాలర్లుగా ఉన్న కేంద్రం వ్యయం, 2023 నాటికి 253 మిలియన్ డాలర్లకు కుంచించుకుపోయింది. టిబి విస్తరించడానికి పౌష్టికాహార లోపం, డయాబెటిస్, పొగ తాగడం, మద్యం సేవించడం, హెచ్ఐవి కారణాలుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. మన దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న పేదరికమే పౌష్టికాహార లోపానికి ప్రధాన కారణం. కోవిడ్ సమయంలో గ్రామీణ ప్రాంతాల ప్రజానీకానికి అండగా ఉన్న ఉపాధి హామీకి సైతం ఏలినవారు నిధులు తెగ్గోస్తున్నారు. 2020 - 21లో రూ.1,09,000 కోట్లు ఉపాధి హామీకి నిధులు కేటాయిస్తే, ఈ ఏడాది కేటాయించింది రూ.81 వేల కోట్లే. అందులో 20 వేల కోట్లు బకాయిలకే పోతే, స్థూలంగా ఖర్చు చేసేది రూ.61 వేల కోట్లే. సమతులాహారం తీసుకుంటే క్షయ వ్యాప్తిని అడ్డుకోవడంతోపాటు మరణాలను 60 శాతం వరకూ తగ్గించవచ్చు. 74 శాతం మంది ప్రజలు పౌష్టికాహారానికే నోచుకోని పరిస్థితి ఉంటే ఇదెలా సాధ్యం? ప్రణాళికా సంఘం లెక్కల ప్రకారం ప్రతి ఒక్కరూ కనీసం 2,200 కేలరీల ఆహారం తీసుకోగలగాలి. అత్యధికులు తమ ఆదాయంలో సగానికిపైగా ఆహారానికే ఖర్చు చేస్తున్నా...ఈ దుస్థితి నెలకొంది. 85 శాతానికి పైగా టిబి రోగులకు చికిత్సను చేరువ చేశామంటూ ప్రభుత్వాలు చెబుతున్నా, ఖరీదైన మందులు కొనుగోలు చేయలేక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. 20 శాతంమందికిపైగా రోగులు తమ వార్షికాదాయంలో 20 శాతానికి పైగా మందులు, వైద్యం కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు టిబి, ఆస్తమా, తలసేమియా సహా వివిధ వ్యాధులకు వినియోగించే యాంటిబయోటిక్స్‌పై 50 శాతం ధరలు పెంచేందుకు కేంద్రం అనుమతించడం పుండు మీద కారం జల్లినట్టయింది. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు సరఫరా చేయాలి. పేదరిక నిర్మూలన, ఆర్థిక అంతరాలను తగ్గించడానికి ప్రాధాన్యతనిస్తేనే వ్యాధి నిరోధక శక్తి పెరిగి, మహమ్మారుల నుంచి ప్రజలను రక్షించగలం. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

మహనీయుల మాట



అసమానతలను,
అన్యాయాలను
మత దురహంకారాన్ని
చూసి ఎదిరించలేకపోతే...
కనీసం ఆ వ్యవస్థను చూసి
నవ్వనైనా నవ్వండి.
- చార్లీ చాప్లిన్

Charlie Chaplin

విశ్లేషణ

మిట్టల్ కోసం విశాఖ స్టీల్‌ను బలి చేస్తారా?



డా॥బి. గంగారావు

టిడిపి కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దెబ్బ తీయటానికి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను తెర మీదకి తీసుకొచ్చిందనేది ముఖ్యమంత్రి ఇటీవలి ఢిల్లీ పర్యటన మరింత స్పష్టం చేస్తోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమిని గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని రక్షిస్తామని, వ్యూహాత్మక అమ్మకపు నిర్ణయం ఉపసంహరణ, సెయిల్‌లో విలీనం, సొంత ముడి ఇనుప గనులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ప్రజలకు వాగ్దానమిచ్చారు. కూటమి గెలిచి ఆరు నెలలైనా ఏ ఒక్క దానిని కూడా నెరవేర్చకుండా చర్చలు, సంప్రదింపుల పేరుతో కాలయాపన చేయడం వెనుక మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ప్రయోజనాలు దాగి ఉన్నాయనే నిగూఢం బయట పడుతున్నది. ఇప్పుడు ఈ వాగ్దానాలు నెరవేర్చడం సాధ్యం కాదని, సెయిల్‌లో విలీనానికి లేదా సొంత ముడి ఇనుప గనులు కేటాయింపుకు, ప్రైవేటీకరణ ఉపసంహరణకు కేంద్ర బిజెపి ప్రభుత్వం అంగీకరించడంలేదనే సాకులు చెప్తున్నారు. అందుకే రూ.18 వేల కోట్ల ప్యాకేజీ కోసం ప్రయత్నం చేస్తున్నామనే ప్రచారానికి పూనుకున్నారు. ఈ అస్తుబిస్తు ప్యాకేజీ కూడా అతీగతీ లేదు.

కర్ణాటకలో భద్రావతి వద్ద వున్న విశ్వేశ్వరయ్య ఐరన్ అండ్ స్టీల్ ప్లాంట్ ఆధునీకరణకు, విస్తరణకు ఇద్దరే ఎంపీలు కలిగిన జె.డి(ఎస్) కేంద్ర బిజెపి పై వత్తిడి చేసి వారం క్రితం ఏకంగా రూ.15 వేల కోట్ల నిధులు మంజూరు చేయించుకోగలిగింది. అంతేగాక ఈ ప్లాంట్‌ని అమ్మేస్తాం లేదా మూసేస్తామని నిర్ణయించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం చేతే దానిని ఉపసంహరింపచేశారు. పెండింగ్‌లో ఉన్న ముడి ఇనుప గనులను కూడా కేటాయించుకోగలిగింది. ఇది కేవలం 262 మంది ఉద్యోగులతో ఉన్న అతి చిన్న ప్రభుత్వ స్టీల్ ప్లాంట్. కానీ టిడిపి, జనసేన పార్టీలకు 21 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం పూర్తిగా వీరి మీదే ఆధారపడి నడుస్తున్నది. ఇంతటి కీలక స్థానంలో ఉండి కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణను ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర కూటమి ప్రభుత్వం నీరుగారుస్తున్నదని అర్థమవుతున్నది. పైపెచ్చు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా కేంద్ర బిజెపి వేటాడుతున్నది. అయినా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపటం లేదు.

విభజన చట్టం ప్రకారం కడపలో కేంద్ర ప్రభుత్వం స్టీల్ పరిశ్రమ పెట్టాలి. దీనిని గాలికొదిలేసి ఇప్పుడు మిట్టల్ వల్ల రాష్ట్రానికి ఏదో వొరుగుతుందని, 20 వేల ఉద్యోగాలు వస్తాయని భజన చేస్తున్నారు. ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదు. పూర్తిగా ఆటోమేషన్‌తో నిర్మిస్తారు. పర్యావరణం విధ్వంసమౌతుంది. అతి తక్కువ మందికి మాత్రమే ఉపాధి కలుగుతుంది. వచ్చే ఉద్యోగాలు 80 శాతం అతి తక్కువ వేతనాలతో, ఏ హక్కులు లేని కాంట్రాక్టు ఉద్యోగాలే. అవి కూడా స్థానికులకు ఇస్తారనే గ్యారంటీ లేదు. ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ స్టీల్ ప్లాంట్ తన టర్నోవర్‌లో 9.8 శాతం, సెయిల్ 11 శాతం కార్మికుల వేతనాలపై ఖర్చు చేస్తుంటే ఆర్సెలార్ మిట్టల్ మాత్రం టర్నోవర్‌లో కేవలం 1.02 శాతం మాత్రమే వేతనాలపై ఖర్చు చేస్తున్నారు. దీన్నిబట్టి మిట్టల్ ప్లాంట్‌లో ఎలాంటి ఉద్యోగాలొస్తాయో అర్థం చేసుకోవచ్చు.

గత ఆరు నెలల్లో విశాఖ స్టీల్ ప్లాంట్‌కి రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో చేయగలిగినవి ఏ ఒక్క సహాయం, సహకారం అందించలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి కొంతకాలం పాటు రాష్ట్ర జిఎస్‌టి మినహాయింపు ఇవ్వమని చంద్రబాబు నాయుడుని స్వయానా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకత్వం కోరినా అంగీకరించలేదు. కనీసం మారటోరియం ప్రకటించమని అభ్యర్థించినా అందుకూ తిరస్కరించారు. విద్యుత్ యూనిట్ రేటు రూ.8 నుండి తగ్గించమని విజ్ఞప్తి చేసినా అంగీకరించలేదు. కనీసం విద్యుత్ బిల్లుల చెల్లింపు గడువు సడలించమని కోరినా నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. విశాఖ స్టీల్ పట్ల టిడిపి, జనసేన కూటమి ఇంత కర్కశంగా వ్యవహరిస్తున్నది.

మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం సాగిలపడి కళ్ళు తిరిగిపోయే రాయితీలు ఇవ్వటానికి సిద్ధమైంది. రాష్ట్ర చరిత్రలో ఏ పరిశ్రమకూ ఇన్ని వేల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చిన దాఖలాలు లేవు. మొదటి దశలో 73 లక్షల టన్నుల సామర్థ్యంతో రూ.70 వేల కోట్ల పెట్టుబడితో స్టీల్‌ప్లాంట్ నిర్మాణంతో పాటు దీనికి అనుబంధంగా 5 బెర్తులతో కూడిన పోర్టును కూడా నిర్మించబోతున్నామని మిట్టల్ యాజమాన్యం ప్రకటించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద ఈ పరిశ్రమకి విశాఖ స్టీల్ ప్లాంట్‌కి 35 కిలోమీటర్ల దూరంలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్య పేట సముద్ర తీరం పక్కనే వేల కోట్ల విలువ గలిగిన 2700 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం ఇస్తున్న భూమిని బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రుణాలు తీసుకోవటానికి అనుమతి ఇస్తున్నది. భూ బదలాయింపుకి మిట్టల్ యాజమాన్యం చెల్లించాల్సిన కోట్లాది రూపాయల రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంపు డ్యూటీకి కూడా మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. పరిశ్రమ నిర్మాణ దశలోనూ, ప్రారంభమైన తరువాత 15 ఏళ్ల పాటు స్టీల్ ఉత్పత్తులపై రాష్ట్ర ప్రభుత్వానికి జిఎస్‌టి చెల్లించకుండా మినహాయింపు ఇచ్చారు. దీనివల్ల రాష్ట్రం ఏడాదికి సుమారు రూ.2500 కోట్లు పన్ను ఆదాయం కోల్పోతుంది. పోర్టు ఎగుమతులు, దిగుమతుల మీద రావాల్సిన పన్నులకు కూడా మినహాయింపు ఇచ్చారు. యూనిట్‌ను రూపాయి చొప్పున 15 ఏళ్ల పాటు విద్యుత్ సరఫరా చేయటానికి ప్రభుత్వం అంగీకరించింది. వాస్తవంగా యూనిట్‌కి రూ.8 చెల్లించాలి. దీనివల్ల ఏడాదికి సుమారు రూ.1800 కోట్ల భారం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి వస్తుంది. ఈ భారాన్ని ప్రజల మీద మోపనున్నారు. స్టీల్ ఉత్పత్తికి అవసరమైన నీటిని అతి తక్కువ ధరకు 15 ఏళ్ళు సరఫరా చేయనున్నారు. ఈ నీటిని కూడ ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సరఫరా అవుతున్న ఏలేరు కాలువ నుండి వస్తున్న నీటిని మిట్టల్ పరిశ్రమకి మళ్లించనున్నారు. వీటితో పాటు మిట్టల్ ప్లాంట్‌కి అవసరమైన ప్రధాన జాతీయ రహదారికి, రైల్వే లైన్‌కి అవసరమైన రహదార్లు, రైల్వే లైన్లు తదితర మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులతో ఏర్పాటు చేయాలి. అందుకు అవసరమైన భూ సేకరణకు అయ్యే చెల్లింపులను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. స్కిల్ డెవలప్‌మెంట్ పథకం కింద మిట్టల్ స్టీల్ కంపెనీల్లో పనిచేసే ప్రతి ఉద్యోగికి నెలకు రూ.6500 చొప్పున ఐదేళ్ళ పాటు చెల్లించటానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇవిగాక పెట్టుబడి రాయితీ కింద వివిధ రూపాల్లో వేల కోట్లు మిట్టల్‌కు సమర్పించబోతున్నారు.

> **చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రిని కలిసి మిట్టల్ ప్లాంట్‌కి ఇనుప ఖనిజాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా సరఫరా చేసుకోవటానికి రైల్వే వేగన్ అనుమతులు ఇవ్వాలని ప్రత్యేకంగా కోరారు. దీనివల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి ఛత్తీస్‌గఢ్ లోని బైలదిల్లా నుండి సరఫరా కావాల్సిన ముడి ఇనుప ఖనిజానికి తీవ్ర అవరోధం ఏర్పడవచ్చు. సరఫరాకు అవసరమైన రైల్వే వేగన్‌లు సకాలంలో సరఫరా చేయరు. దాంతో కర్ణాటక నుండి ఇనుప ఖనిజాన్ని రప్పించుకోవాల్సి వస్తుంది. ఒక టన్ను ముడి ఇనుముకు అదనంగా సుమారు రూ.1000 వ్యయాన్ని భరించాల్సి వస్తుంది. పైపెచ్చు ఈ ముడి ఇనుప ఖనిజం తక్కువ నాణ్యత కలిగినది. ఇప్పటికే సొంత ముడి ఇనుప గనులు లేకపోవడం వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏడాదికి అదనంగా సుమారు రూ.3 వేల కోట్లు ముడి ఇనుప ఖనిజానికి చెల్లించాల్సి వస్తున్నది. ఈ పరిణామాల వల్ల ఉత్పత్తి వ్యయం భారీగా పెరుగుతుంది. ఉత్పత్తిపై కూడా కోతబడుతుంది. మార్కెట్‌లో స్టీల్‌ని అమ్ముకోలేని పరిస్థితి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు దాపురిస్తుంది. దీంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.**

విశాఖ స్టీల్ ప్లాంట్‌కి దగ్గరలోనే మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను ఎందుకు నిర్మించాలని భావిస్తున్నారు? కేవలం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బ తీసి దక్షిణ భారతదేశంలో స్టీల్ మార్కెట్ మొత్తాన్ని తన వశం చేసుకోవడం కోసమే. ఛత్తీస్‌గఢ్, ఒరిస్సాతో పాటు మొత్తం 8 చోట్ల అత్యంత నాణ్యమైన ముడి ఇనుప గనులను కేంద్ర ప్రభుత్వం మిట్టల్ సంస్థకు కేటాయించింది. ఇప్పుడు ఈ ఖనిజాన్ని బైలదిల్లా నుండి విశాఖకు ఉన్న కె.కె లైన్ ద్వారా నిరాటంకంగా సరఫరా చేసుకోవడానికి అనువైన ప్రాంతం. అలాగే ముడి ఇనుప ఖనిజం సరఫరాకు బైలదిల్లా నుండి ఇప్పటికే విశాఖలో మిట్టల్‌కు ఉన్న స్టీల్ పెల్లెట్ ప్లాంట్‌కు పైప్‌లైన్ కూడా ఉంది. అతి తక్కువ రవాణా వ్యయంతో దిగుమతి చేసుకోవచ్చు. అలాగే చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రిని కలిసి మిట్టల్ ప్లాంట్‌కి ఖనిజాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా సరఫరా చేసుకోవటానికి రైల్వే వేగన్ అనుమతులు ఇవ్వాలని ప్రత్యేకంగా కోరారు. దీనివల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి ఛత్తీస్‌గఢ్ లోని బైలదిల్లా నుండి సరఫరా కావాల్సిన ముడి ఇనుప ఖనిజానికి తీవ్ర అవరోధం ఏర్పడవచ్చు. సరఫరాకు అవసరమైన రైల్వే వేగన్‌లు సకాలంలో సరఫరా చేయరు. దాంతో కర్ణాటక నుండి ఇనుప ఖనిజాన్ని రప్పించుకోవాల్సి వస్తుంది. ఒక టన్ను ముడి ఇనుముకు అదనంగా సుమారు రూ.1000 వ్యయాన్ని భరించాల్సి వస్తుంది. పైపెచ్చు ఈ ముడి ఇనుప ఖనిజం తక్కువ నాణ్యత కలిగినది. ఇప్పటికే సొంత ముడి ఇనుప గనులు లేకపోవడం వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏడాదికి అదనంగా సుమారు రూ.3 వేల కోట్లు ముడి ఇనుప ఖనిజానికి చెల్లించాల్సి వస్తున్నది. ఈ పరిణామాల వల్ల ఉత్పత్తి వ్యయం భారీగా పెరుగుతుంది. ఉత్పత్తిపై కూడా కోతబడుతుంది. మార్కెట్‌లో స్టీల్‌ని అమ్ముకోలేని పరిస్థితి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు దాపురిస్తుంది. దీంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. చంద్రబాబు, పవన్ కూటమి బృందం కేంద్ర బిజెపి ప్రభుత్వంతో కలిసి దీనిని సాకుగా చూపి ప్లాంట్‌ని మిట్టల్‌కి అమ్మేయటానికో లేదా మూసివేతకో అనివార్యంగా పాల్పడతారనేది అక్షర సత్యం. మిట్టల్ యాజమాన్యం దీనినే కోరుకుంటున్నది.


మిట్టల్ సంస్థకి విదేశాల్లో విస్తారంగా బొగ్గు గనులు కూడా ఉన్నాయి. కొత్తగా ప్లాంట్‌కి అనుబంధంగా నిర్మించబోతున్న పోర్టు ద్వారా అతి తక్కువ వ్యయంతో బొగ్గును కూడా విదేశాల నుండి దిగుమతి చేసుకోగలుగుతారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పన్నులు, విద్యుత్, నీటితోపాటు ఇతర అనేక వేల కోట్ల విలువ చేసే రాయితీలు ఉండనే ఉన్నాయి. వీటన్నిటి వల్ల మిట్టల్ విశాఖ స్టీల్ కంటే తక్కువ ధరకు స్టీల్‌ని మార్కెట్‌లో అమ్ముకోగలడు. దీంతో మొత్తం దక్షిణ భారత స్టీల్ మార్కెట్ మిట్టల్ పరమవుతుంది. ఈ వ్యూహం తోటే మిట్టల్ అనకాపల్లి జిల్లా నక్కపల్లి దగ్గరలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి పూనుకుంటున్నారు.

మిట్టల్ కోసం రూ.3 లక్షల కోట్ల విలువ కలిగి, 30 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పిస్తూ, లక్ష మందికి పైగా జీవనాధారంగా, రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.2500 కోట్లు పన్నులు చెల్లిస్తూ ఉత్తరాంధ్రకు వెన్నుదన్నుగా ఉన్న విశాఖ స్టీల్‌ను నిలువునా ముంచేయటానికి బిజెపి తో కలిసి టిడిపి, జనసేన కలిసి కుట్ర పన్నటం తెలుగు ప్రజలకు ద్రోహం చేయడమే. ఈ ద్రోహాన్ని ఇప్పటికైనా వీడాలి. ప్రస్తుత 73 లక్షల టన్నుల నుండి మరో 150 లక్షల టన్నుల సామర్థ్య విస్తరణతో పాటు అదనంగా ఇంకో 50 వేల మందికి ఉపాధి కల్పించగలిగే అవకాశం వున్న మన విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం, సొంత ముడి ఇనుప గనులు లేదా సెయిల్‌లో విలీనం చేయటం, అప్పులపై మారటోరియం, రూ.20 వేల కోట్ల నిధుల సాధన కోసం చిత్తశుద్ధితో కేంద్ర బిజెపితో టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం పోరాడితేనే రాష్ట్రానికి భవిష్యత్తు.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

అంతర్జాతీయం

అరవై ఆరేళ్ల క్యూబా సోషలిస్టు విప్లవం!



ఎం. కోటేశ్వరరావు

క్యూబా సోషలిస్టు విప్లవం 66వ ఏడాదిలో ప్రవేశించింది. 1953 జులై 26న నియంత బాటిస్టా పాలనకు వ్యతిరేకంగా ప్రారంభమైన తిరుగుబాటు...1959 జనవరి ఒకటిన విప్లవోద్యమ నేత ఫైడెల్ కాస్ట్రో అధికారానికి రావటంతో ముగిసింది. ఐదు సంవత్సరాల ఐదు నెలల ఐదవ రోజు 1958 డిసెంబరు 31న బాటిస్టా ప్రభుత్వాన్ని కూల్చివేశారు. 1959 జనవరి ఒకటిన కాస్ట్రో అధికారానికి వచ్చాడు. జులై 26 ఉద్యమం పేరుతో ఉన్న వారు కీలక పాత్ర పోషించారు. తరువాత మార్క్సిజం-లెనినిజాన్ని ఆమోదించి 1965 అక్టోబరులో క్యూబా కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. అయితే విప్లవంలో కీలక ఘట్టమైన జులై 26వ తేదీని విప్లవ దినంగా పరిగణించారు. విప్లవాన్ని మొగ్గలోనే తుంచి వేసేందుకు వెంటనే అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని ప్రారంభించి, క్రమంగా తీవ్రతరం కావించింది. నాటి నుంచి నేటి వరకు అక్కడ రిపబ్లికన్ పార్టీ-డెమోక్రటిక్ పార్టీ ఎవరు అధికారంలో ఉన్నా మానవాళి చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ దిగ్బంధనం కొనసాగుతూనే ఉంది. అమెరికాకు క్యూబా కూత వేటు దూరంలో ఉంది. రెండు దేశాల సమీప భూభాగాల మధ్య దూరం కేవలం 90 మైళ్లు (145 కిలోమీటర్లు) మాత్రమే. కరీబియన్ సముద్ర మెక్సికో అఖాతం, అట్లాంటిక్ మహా సముద్రం కలిసే ప్రాంతంలో ఉన్న కోటి 12 లక్షల జనాభాతో ప్రధాన భూభాగానికి అనుబంధంగా 4,195 చిన్నా, పెద్ద దీవులు ఉన్న దేశం. అన్ని రకాల దిగ్బంధాలతో అక్కడి జనాన్ని మాడిస్తే వారు తిరుగుబాటు చేసి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేసి తమ ఒడిలో కూర్చుంటారని 65 ఏళ్లుగా అమెరికా చూస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అగ్ర రాజ్యానికి తలొగ్గకుండా ఆత్మగౌరవంతో పితృదేశమా (కొన్ని దేశాలు పితృసామిక వ్యవస్థను అనుసరించి అలా పిలుచుకుంటాయి. దేశభక్తిలో ఎలాంటి తేడా ఉండదు) లేక మరణమా అన్న ఆశయంతో ముందుకు సాగుతున్నది.

గత పాతికేళ్లలో 120 దేశాలకు చెందిన వారు 31,180 మంది వైద్యులుగా తయారు కాగా ప్రస్తుతం 1,800 మంది విద్యార్థులున్నారు. హవానాకు పశ్చిమంగా ఉన్న నౌకా కేంద్రాన్ని కాలేజీగా మార్చారు. మొదటి రెండు సంవత్సరాలు అక్కడ ఆసుపత్రులతో అవసరం లేని బోధన చేస్తారు. నాలుగు సంవత్సరాల పాటు క్యూబాలోని బోధనా ఆసుపత్రులలో శిక్షణ ఇస్తారు. మూడంచెల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో భాగంగా 69 వైద్య ప్రత్యేక చికిత్స కేంద్రాలు, 149 ఆసుపత్రులు, 451 పాలి క్లినిక్‌లు, 11,315 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో నాలుగు లక్షల మంది సిబ్బంది పని చేస్తున్నారు. ప్రతి వెయ్యి మందికి (మొత్తం 80 వేల మంది) ఒక వైద్యుడు లేదా వైద్యురాలు ఉన్నారు. పదమూడు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. 2,767 వైద్య పరిశోధనా ప్రాజెక్టులు, 82 క్లినికల్ ప్రయోగాలు నడుస్తున్నాయి. 160 దేశాలలో 6 లక్షల మంది క్యూబన్లు వైద్య సేవలు అందిస్తున్నారు.

క్యూబా సర్కార్ జనానికి అందిస్తున్న సబ్సిడీ ఆహార పథకాన్ని అదిగో రద్దు చేస్తున్నారు ఇదిగో రద్దు చేస్తున్నారంటూ గత రెండు దశాబ్దాలుగా అమెరికా, దాని ఉప్పు తింటున్న మీడియా కథనాలు రాస్తూనే ఉంది. కొన్ని సందర్భాలలో దుర్వినియోగం జరిగినపుడు పథకాన్ని సవరించటం గురించి మాట్లాడారు తప్ప ఎత్తివేత గురించి కాదు. సోవియట్, ఇతర తూర్పు ఐరోపా సోషలిస్టు రాజ్యాలు కూలిపోయిన తరువాత క్యూబా అనేక తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న మాట నిజం. అవి ఉనికిలో ఉన్నపుడు కూడా ఉన్నదేదో కలసి తింటాం లేకుంటే కాళ్లు ముడుచుకు పడుకుంటాం తప్ప అమెరికా ముందు చేయి చాచం అని ఫైడెల్ కాస్ట్రో దశాబ్దాల క్రితమే చెప్పారు. దానిలో భాగంగానే ఆహార సబ్సిడీ-పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. దాన్నే రేషన్ బుక్ అని పిలుస్తున్నారు. ప్రతి ఏటా ఒక పుస్తక రూపంలో కూపన్లు ఇస్తే దుకాణాల్లో వాటితో సరకులు తీసుకుంటారు.1962 నుంచి ఈ పథకం అమల్లో ఉంది. ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా బియ్యం, బీన్స్, బంగాళాదుంప, అరటికాయలు, బఠాణీ గింజలు, కాఫీ, వంటనూనె, గుడ్లు, మాంసం, కోడి మాంసం, పిల్లలకు పాలు సరఫరా చేస్తున్నారు. ఈ మధ్య పోషకాహార లేమి వలన క్యూబాలో మరణాల రేటు 2022 నుంచి 2023కు 74.42 శాతానికి పెరిగిందంటూ కొన్ని పత్రికలు పతాక శీర్షికలతో వార్తలను ఇచ్చాయి. అక్కడ సంభవిస్తున్న మరణాలకు కారణాలలో పోషకాహార లేమి ఇరవయ్యవదిగా ఉంది. ఇంతకూ పైన పేర్కొన్న సంవత్సరాలలో మరణించిన వారి సంఖ్య 43 నుంచి 75కు పెరిగింది. కోటి మంది జనాభా, అష్టకష్టాలు పడుతూ, 80 శాతం ఆహారాన్ని దిగుమతి చేసుకుంటున్న అక్కడ మరణాలు అవి. ప్రపంచానికి ఆహారాన్ని అందచేసే స్థితిలో ఉన్నామని మన ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన మన దేశంలో 140 కోట్ల జనాభాలో పోషకాహార లేమి కారణంగా ఎందరు మరణిస్తున్నారో తెలుసా! హిండ్‌రైజ్ డాట్ ఓఆర్‌జి సమాచారం ప్రకారం మన దేశంలో రోజుకు ఏడు వేల మంది మరణిస్తున్నారు. ఐదేళ్ల లోపు వయస్సున్న పిల్లల మరణాలలో 69 శాతం పోషకాహార లేమి కారణమని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా సుప్రీం కోర్టుకు 2022లో తెలిపింది.


మన దేశంలో ఆహార భద్రతా చట్టం అమల్లో ఉంది. దానిలో భాగంగా 80 కోట్ల మందికి గతంలో సబ్సిడీ బియ్యం లేదా గోధుమలు ఇవ్వగా ఇప్పుడు ఉచితంగా ఇస్తున్నారు. అయినా మన దేశం 2024 ప్రపంచ ఆకలి సూచిక 127 దేశాలలో 105వదిగా ఉంది. పదేళ్ల అచ్చే దిన్‌లో ఆకలి తీవ్రంగా ఉన్న దేశాల సరసన మన దేశాన్ని ఉంచిన ఘనత విశ్వగురువు నరేంద్ర మోడీకి దక్కింది. వరల్డ్ పాపులేషన్ రివ్యూ డాట్ కామ్ సమాచారం ప్రకారం 171 దేశాల జాబితాలో మన దేశంలో పోషకాహార లోపం ఉన్నవారు 2011లో 18.35 కోట్ల మంది ఉంటే, 2023లో 19.46 కోట్ల మందికి పెరిగారు. నిజానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువ. పోషకాహార లేమి నామమాత్రంగా ఉన్నప్పటికీ ఆయా దేశాలలో 2.5 శాతం మంది ఉన్నట్లు లెక్కిస్తారు. అలాంటి దేశాల జాబితాలో చైనా, క్యూబా ఇంకా అనేక దేశాలు ఉన్నాయి. మన దేశంలో పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ దాన్ని గుర్తించటానికి మోడీ సర్కార్ ససేమిరా అంటున్నది.

క్యూబా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారటానికి, ఇతర సమస్యలకు కారణం అమెరికా విధించిన ఆర్థిక దిగ్బంధనమే. ఆంక్షలను తొలగించాలని ప్రతి ఏటా ఐరాసలో తీర్మానం పెట్టటం, అమెరికా, దాని తొత్తు ఇజ్రాయిల్ వ్యతిరేకించటం మిగిలిన దేశాలన్నీ సమర్థించటం తెలిసిందే. అయితే ఐరాస సాధారణ అసెంబ్లీ తీర్మానాలకు పూచికపుల్ల పాటి విలువ కూడా లేదు. వాటిని ధిక్కరించిన దేశాలను చేసేదేమీ లేదు. అమెరికా దిగ్బంధనం వలన ప్రపంచంలో మరో దేశమేదీ క్యూబా మాదిరి నష్టపోవటం లేదు. ఎందుకు ఇలా జరుగుతోంది? ప్రపంచ మంతటా కమ్యూనిజాన్ని అరికడతానంటూ బయలు దేరిన అమెరికన్ పాలకులకు తమ పెరటితోట వంటి క్యూబాలో కమ్యూనిస్టులు అధికారంలో ఉండటం అవమానకరంగా మారింది. గతంలో డోనాల్డ్ ట్రంప్ అమలు జరిపిన కఠిన ఆంక్షలను సడలిస్తానని జో బైడెన్ ప్రకటించినప్పటికీ అలాంటదేమీ జరగలేదు, పదవీ కాలం ముగియనుంది. తిరిగి ట్రంప్ గద్దెనెక్కనున్నాడు. అమెరికా దిగ్బంధనం కారణంగా ప్రతి నెలా క్యూబా 42 కోట్ల డాలర్లు నష్టపోతున్నదని అంచనా, ఎన్నాళ్లీ దుర్మార్గం!

> **అమెరికాకు క్యూబా కూత వేటు దూరంలో ఉంది. రెండు దేశాల సమీప భూభాగాల మధ్య దూరం కేవలం 90 మైళ్లు (145 కిలోమీటర్లు) మాత్రమే. కరీబియన్ సముద్ర మెక్సికో అఖాతం, అట్లాంటిక్ మహా సముద్రం కలిసే ప్రాంతంలో ఉన్న కోటి 12 లక్షల జనాభాతో ప్రధాన భూభాగానికి అనుబంధంగా 4,195 చిన్నా, పెద్ద దీవులు ఉన్న దేశం. అన్ని రకాల దిగ్బంధాలతో అక్కడి జనాన్ని మాడిస్తే వారు తిరుగుబాటు చేసి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేసి తమ ఒడిలో కూర్చుంటారని 65 ఏళ్లుగా అమెరికా చూస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అగ్ర రాజ్యానికి తలొగ్గకుండా ఆత్మగౌరవంతో పితృదేశమా (కొన్ని దేశాలు పితృసామిక వ్యవస్థను అనుసరించి అలా పిలుచుకుంటాయి. దేశభక్తిలో ఎలాంటి తేడా ఉండదు) లేక మరణమా అన్న ఆశయంతో ముందుకు సాగుతున్నది.**



నూతనోత్సవం



కొత్తగా సరికొత్తగా జీవితం మొదలవ్వాలి
చిగురులు తొడుగుతూ రెక్కలు మొలిచినట్టు
స్వేచ్ఛగా విహరించాలి.

బతుకును దుక్కులు దున్ని చదును చేసుకోవాలి
మెట్ట, మాగాణి రంగులేసుకుని
పచ్చని పంటలు పండాలి
బీదబిక్కి జనం గొంతులో
గుక్కెడు గంజి ఒంపుకోవాలి
ఆత్మగౌరవంగా బతకాలి.


పిల్లపెద్ద , ముసలిముతక స్త్రీల బతుకుల్లో
ధైర్యం కాగడాల్లా దేశానికి వెలుగులుజిమ్మాలి
తాడీత పీడిత కులాలపై దాడులు లేకుండా
ఆధిపత్యం నశించి అగ్ర కులాల
సమానభావన కలగాలి.

మతాల మధ్య విద్వేషాలు గాక
ముగ్గుల్లో రంగులు కలిసినట్టు
మనుషుల్లో సోదర భావం కలవాలి
జాతులంతా వేరైనా మానవత్వం ఒకటై
పండగ సేయాలి.

నూతనోత్సవం కొరకు
నూతన జీవితం మొదలెట్టాలి
ఎప్పుడూ నిత్య నూతనంగా మనిషులు బతకాలి
దేశమంతా వెలుగుల వేడుకలు చేయాలి.

- తంగిరాల సోని
సెల్ : 9676609234

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్
editpageps @ gmail.com



5శాతం వృద్ధిరేటు లక్ష్యం

- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్ : కొత్త సంవత్సరంలో మరింత క్రియాశీలక స్థూల ఆర్థిక విధానాలను చైనా అమలు చేయాలని అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. కొత్త ఏడాదిని పురస్కరించుకుని ఉన్నత రాజకీయ సలహా మండలినుద్దేశించి ఆయన ప్రసంగించారు. రియల్ ఎస్టేట్ మార్కెట్ సంక్షోభం వల్ల తలెత్తిన ఆర్థిక మాంద్యం నుండి బయటపడేందుకు దేశం ఈ ఏడాది చాలా పోరాటం చేయాల్సి వచ్చిందని ఆయన గుర్తు చేసుకున్నారు. అలాగే బలహీనంగా వున్న వినిమయం, పెరుగుతున్న ప్రభుత్వ రుణ భారం కూడా పెను ముప్పుగా తయారయ్యాయన్నారు. ఆర్థిక వృద్ధిని పెంచడమే లక్ష్యంగా ఇటీవలి మాసాల్లో ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుందన్నారు. వడ్డీరేట్లలో కోత, ఇళ్ల కొనుగోళ్లపై ఆంక్షలను రద్దు చేయడం, స్థానిక ప్రభుత్వాలపై రుణా భారాన్ని సడలించడం వంటి చర్యలు అమలు చేసిందన్నారు. ఈ ఏడాది 5శాతం జాతీయ వృద్ధి రేటును సాధించగలమన్న విశ్వాసాన్ని అధికారులు వ్యక్తం చేశారు. ఈ ఏడాది 4,8శాతం , వచ్చే ఏడాది 4.5శాతం మేర చైనా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది.

ఢిల్లీలో పూర్ కేటగిరీలో గాలి నాణ్యతలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతలు పడిపోయాయి. మంగళవారం ఉదయం 8 గంటలకు ఢిల్లీలో 245 వద్ద గాలి నాణ్యతలు (ఎక్యూఐ) నమోదయ్యాయని, ఎక్యూఐని పూర్ కేటగిరీలో వర్గీకరించినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ఢిల్లీలో దట్టమైన పొగమంచు కురుసింది. దీంతో స్థానికులు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ఢిల్లీలో సగటు 10.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 11 డిగ్రీలు, మధ్య, గరిష్ట ఉష్ణోగ్రత 15 నుండి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చునని ఐఎండి అంచనా వేసింది. ఢిల్లీలోని నజాఫ్‌గర్ 9.6 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సనాతన ధర్మానికి, వర్ణాశ్రమ ధర్మానికి తేడా లేదు

- పినరయి విజయన్



శివగిరి యాత్ర ప్రారంభ సందర్భంగా జరిగిన సభలో పినరయి విజయన్ తదితరులు

తిరువనంతపురం : సనాతన ధర్మానికి, వర్ణాశ్రమ ధర్మానికి తేడాలేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం గొప్పదని ప్రచారం చేస్తున్న వాళ్లనుద్దేశించి మంగళవారం ఈ వ్యాఖ్యలు చేశారు. 92వ శివగిరి యాత్రను ప్రారంభించిన సందర్భంగా విజయన్ మాట్లాడుతూ, శ్రీ నారాయణగురు కేరళలో సంస్కరణ వాద ఉద్యమంలో అగ్రగామిగా నిలిచారని, ఆయన మార్గం సనాతన ధర్మం కాదని స్పష్టం చేశారు. వర్ణాశ్రమ ధర్మాన్ని (చాతుర్వర్ణ వ్యవస్థను) నారాయణగురు ప్రశ్నించారని, ధిక్కరించారని గుర్తు చేశారు. కుల, మత వివక్ష లేని మానవత్వమే నారాయణగురు సందేశమని చెప్పారు. నారాయణ గురును సనాతన ధర్మ ప్రతిపాదకుడిగా చూపించడానికి జరుగుతున్న వ్యవస్థీకృత యత్నాలను విజయన్ తీవ్రంగా ఖండించారు. నారాయణగురును సనాతన ధర్మ చట్రంలో ఉంచడం ఆయనకు అవమానమని అన్నారు. ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు అని ప్రచారం చేసిన నారాయణ గురు సనాతన ప్రతిపాదకుడు ఎలా అవుతారని ప్రశ్నించారు. లోకా సమస్తా సుఖినోభవంతు అంటూ ఆవు, బ్రాహ్మణుడు సంతోషంగా ఉంటే ప్రపంచమంతటా సంతోషంగా ఉంటుందనే అర్థంలో వాడారని అన్నారు. ప్రస్తుతం దేశంలో గోవు, బ్రాహ్మణ వాద హిందుత్వంతో గ్రామీణ భారతంలో దళితులు, మైనార్టీలు హింసకు గురవుతున్నారని విజయన్ విమర్శించారు. సనాతన ధర్మం ఏకస్వామ్యాన్ని, బ్రాహ్మణ పెత్తందారుల అణచివేత చర్యలను, ఆధిపత్యాన్ని చాటిందని చెప్పారు.

సైబర్ క్రైమ్ కేసులో ఇద్దరు మోసగాళ్ల అరెస్టు

- నిందితులపై దేశవ్యాప్తంగా కేసులు

భువనేశ్వర్ : దేశవ్యాప్తంగా వివిధ నేరాలకు పాల్పడిన ఇద్దరు ఘరానా మోసగాళ్లను ఒడిషా పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన కె.సతీష్‌కుమార్, కేరళకు చెందిన సి.ఎం. హరీష్ సైబర్ క్రైమ్‌లో అరితేరిపోయారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని అమాయకులను ఆన్‌లైన్‌ల్లో బెదిరించి, ప్రలోభాలకు గురిచేసి వారి వద్ద నుంచి నగదు కాజేసేవారు. వీరిపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సతీష్‌కుమార్‌పై 22 ఫిర్యాదులు, హరీష్‌పై ఆరు ఫిర్యాదులు ఉన్నాయి. తాజాగా ఈ ఇద్దరు భువనేశ్వర్‌కు చెందిన ఒక సీనియర్ సైంటిస్టును మోసం చేశారు. ఆయన వద్ద నుంచి రూ.1.06 కోట్లను దోచుకున్నారు. సతీష్‌కుమార్ రూ.68 లక్షలు, హరీష్ రూ.30 లక్షలు తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. దీనిపై సైంటిస్టు ఆగస్టు 9న ఫిర్యాదు చేశారు. ముంబయి క్రైమ్ బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నట్లుగా నటించి సైంటిస్టును భయపెట్టారు. అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే భారీగా మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని చెప్పారు. సైంటిస్టు ఆ విధంగానే చేశారు. చివరికి వీరిని ఒడిషా క్రైమ్ బ్రాంచ్ బృందం అరెస్టు చేసి, భువనేశ్వర్‌లోని కోర్టులో హాజరుపర్చారు.

నిమిష ప్రియకు తోడ్పాటు

- విదేశాంగ శాఖ వెల్లడి



యెమెన్‌లో నిమిష తల్లి ప్రేమకుమారి, శామ్యూల్ జెరోమ్ భాస్కరన్, భారత దౌత్య సిబ్బంది సనా

న్యూఢిల్లీ : ఓ హత్యకేసులో మరణశిక్ష పడిన కేరళ నర్సు నిమిష ప్రియాంకకు న్యాయ పోరాటంలో సహకరిస్తామని భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఈ కేసులో ఆమెకు అన్నివిధాలా సాయం చేస్తామని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ చెప్పారు.. కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన నర్సు నిమిష ప్రియ గత కొన్నేళ్లుగా యెమెన్‌లో పనిచేస్తున్నారు. యెమెన్ జాతీయుడు తలాల్ అబ్దో మహదీ, నిమిష ప్రియ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. ఆమె తన పాస్‌పోర్టును తిరిగి తీసుకునేందుకు మహదీకి మత్తుమందును ఇంజెక్ట్ చేసింది. స్పృహ కోల్పోయిన తర్వాత తన పాస్‌పోర్టు తీసుకోవాలనుకుంది. మత్తుమందు ఓవర్‌డోస్ కావడం వల్ల మహదీ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 2017లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి 2018లో నిమిషాకు యెమెన్ కోర్టు మరణశిక్ష విధించింది. ఈ శిక్షపై ఆమె 2023లో యెమెన్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేయగా, ఆ అప్పీల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. తాజాగా ఈ కేసులో నిమిష ప్రియకు యెమెన్ కోర్టు విధించిన మరణశిక్షకు అధ్యక్షుడు ఆమోదం తెలిపారు. హత్యకు గురైన మహది కుటుంబ సభ్యులు అమెకు క్షమాభిక్ష పెడితే మరణశిక్ష నుంచి బయటపడే అవకాశం ఉంది. నిమిషకు వివాహమై ఎనిమిదేళ్ల పాప ఉంది. 2011లో ఆమె కుటుంబంతో సహా యెమెన్‌కు వెళ్లింది. ఆమె యెమెన్‌లో సనాలో క్లినిక్ నడిపేది. యెమెన్ చట్టాల ప్రకారం విదేశీ పౌరులెవరైనా స్థానిక భాగస్వాములతో కలిసే వ్యాపారం నిర్వహించాల్సి వుంది. దీంతో స్థానికుడైన మహదీని ఆమె తన క్లినిక్‌లో భాగస్వామిగా చేర్చుకుంది. మహదీ కొన్ని సంవత్సరాలుగా తనను వేధిస్తున్నాడని, తన వ్యాపారం నుండి డబ్బు కూడా వసూలు చేసుకున్నాడని నిమిషా ఆ దేశ అధికార ప్రతినిధులకు తెలిపింది. ఈ విషయంలో పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోయింది. చిట్టచివరకు అతడి దగ్గర చిక్కుకుపోయిన తన పాస్‌పోర్టును తిరిగి తీసుకునే క్రమంలో అతడి మరణానికి కారణమైంది.

క్వాడ్ కూటమికి జై శంకర్ పొగడ్తలు

న్యూఢిల్లీ : అమెరికా ఇండో పసిఫిక్ వ్యూహంలో భాగంగా ఏర్పడిన క్వాడ్ కూటమిని భారత విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ పొగడ్తలతో ముంచెత్తారు. సునామీని కలిసికట్టుగా ఎదుర్కోవడంలో క్వాడ్ కృషి చేసిందని అన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, భారత్, జపాన్‌లతో ఏర్పడిన ఈ కూటమి ఇండో పసిఫిక్ ప్రాంతంలో కీలక శక్తిగా మారిందన్నారు. క్వాడ్ ఇరవయ్యో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నాడిక్కడ ఈ కూటమి విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. అనంతరం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదలజేశారు. ఇండో-పసిఫిక్ భవిష్యత్ అవసరాలను తీర్చే దిశగా క్వాడ్ కలిసికట్టుగా కృషి చేస్తుందని ఈ సమావేశం పేర్కొంది. 2004లో హిందూ మహా సముద్రంలో భూకంపం, సునామీ సంభవించిన నేపథ్యంలో పరస్పరం సహకరించుకునేందుకు 20ఏళ్ళ క్రితం భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు నిర్ణయించి క్వాడ్‌గా రూపొందాయి. నాలుగు దేశాలు కలిసి 40వేల మంది అత్యవసర కార్యకర్తలను అందించాయని, ఇండో-పసిఫిక్ ప్రాంత వ్యాప్తంగా ఇతర భాగస్వాములతో కలిసి ఈ విపత్తు వల్ల దెబ్బతిన్న లక్షలాదిమంది ప్రజలకు మద్దతుగా నిలిచేందుకు కృషి చేస్తున్నామని ఆ ప్రకటన పేర్కొంది.

సుపరిపాలన సూచీకి మంగళం

- తదుపరి సూచీకి వచ్చే సంవత్సరమే



న్యూఢిల్లీ : 2023వ సంవత్సరానికి సంబంధించిన సుపరి పాలన సూచీని విడుదల చేయరాదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ద్వైవార్షిక సూచికలను సుపరిపాలన వారంలో (ఈ నెల 19 నుండి ఈ నెల 25 వరకూ) విడుదల చేయాల్సి ఉండగా, ఆ పని జరగలేదు. దీనిని వచ్చే సంవత్సరం ప్రచురించాలని కేంద్రం భావిస్తోంది. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా 2019 డిసెంబర్ 25న సుపరిపాలన సూచీని విడుదల చేయడం ప్రారంభించారు. ఆ రోజునే సుపరిపాలన దినంగా పాటిస్తున్నారు. వ్యవసాయం, ఆర్థిక పాలన, ప్రజారోగ్యం, పౌరుల కేంద్రంగా పరిపాలన వంటి వివిధ రంగాలకు చెందిన యాభై సూచికలను పరిగణనలోకి తీసుకుంటారు. పెద్ద రాష్ట్రాలకు సంబంధించి 2019 ర్యాంకింగ్స్‌లో తమిళనాడు, 2021 ర్యాంకింగ్స్‌లో గుజరాత్ మొదటి స్థానంలో నిలిచాయి.

సుపరిపాలన సూచీని విడుదల చేయాలని సిబ్బంది, ప్రజా సమస్యలు, పెన్షన్ల మంత్రిత్వ శాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవియన్సెస్ (డిఎఆర్‌పిజి) డిసెంబర్ 7న భావించింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 19-24 తేదీల మధ్య దేశవ్యాప్త ప్రచారం చేపడతామని ప్రకటించింది. ఆ వారంలో ప్రత్యేక ప్రచారం 4.0, 2023 సుపరిపాలన సూచీ, సిపిజిఆర్ఎఎంఎస్ వార్షిక నివేదిక విడుదల చేస్తామని పత్రికా ప్రకటనలో ప్రకటించింది కూడా. దానికి ముందే నవంబరులో మంత్రిత్వ శాఖ వార్షిక నివేదిక (2023-24)ను విడుదల చేశారు. 'మొదటి జిజిఐని 2019లో, రెండో దానిని 2021లో విడుదల చేశాము. 2023కు సంబంధించిన మూడో జిజిఐని రూపొందించాం. దానిని త్వరలోనే విడుదల చేస్తాం' అని ఆ నివేదికలో మంత్రిత్వ శాఖ తెలిపింది. డిసెంబర్ 23న జిజిఐని విడుదల చేయాలని భావించారని, ప్రభుత్వం అందుకు సుముఖత చూపలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2023కు సంబంధించి రాష్ట్రాల నుండి సమాచారాన్ని సేకరించడం, దానికి సంబంధించిన సూచీని 2024 చివరలో విడుదల చేయడం అంటే ఆ సమాచారం పాతబడిపోయిందని, దానికి కాలం చెల్లిందని అర్థమని ఆ వర్గాలు వివరించాయి. మళ్లీ కసరత్తు ప్రారంభించి కొత్త సమాచారాన్ని సేకరిస్తారని తెలుస్తోంది.

దీనిపై డిఎఆర్‌పిజి కార్యదర్శి వి.శ్రీనివాస్‌ను సంప్రదించగా 'రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై అంచనాలు వేసి రెండు సంవత్సరాలకు ఒకసారి జిజిఐని ప్రచురించడం జరుగుతుంది. తదుపరి ఎడిషన్ 2025 చివరలో ప్రచురితమవుతుంది. 2019, 2021 నివేదికలను డిఎఆర్‌పిజి విడుదల చేసింది. 2021-2024కు సంబంధించి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, జమ్మూకాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల జిల్లా సుపరిపాలన సూచీలను ప్రచురించడం జరిగింది' అని చెప్పారు. 2021 సూచీని ఆ సంవత్సరం డిసెంబర్ 25న కేంద్ర హోం మంత్రి అమిత్ షా విడుదల చేశారు. పది రంగాలకు చెందిన 58 సూచికలను అది క్రోడీకరించింది. గుజరాత్ మొదటి స్థానంలో నిలవగా, 2019తో పోలిస్తే పది రాష్ట్రాలు మెరుగైన ఫలితాలు సాధించాయి.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో కుల దురహంకార దాడులు : ఖర్గే


న్యూఢిల్లీ : బిజెపి పాలిత రాష్ట్రాలైన హర్యానా, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో దళితులు, ఆదివాసీలపై కుల దురహంకార దాడులు పెరిగిపోయాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 'ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా అట్టడుగు వర్గాల వారిని అణగదొక్కాలనే మనస్తత్వంతోనే వారిపై దాడులు జరుగుతున్నాయి' అని ఖర్గే మంగళవారం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. మోడీ రాజ్యాంగ వ్యతిరేక పాలనలో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. నిరుపేదలు మనువాదుల కష్టాల్ని భరిస్తున్నారని ఆయన తెలిపారు.

4 నుంచి పక్షుల గణన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పక్షుల గణన ప్రారంభం కానుంది. స్థానిక పక్షిజాతులతోపాటు ప్రతియేటా విదేశాల నుంచి వచ్చే వివిధ రకాల పక్షులపైనా ఈ గణన నిర్వహించనున్నారు. ఈ గణనలో పలు భాగస్వాములను చేయాలని అధికారులు నిర్ణయించారు. జనవరి నాలుగో తేదీ నుంచి రెండు విడతలుగా ఈ గణన నిర్వహించనున్నారు. ప్రధానంగా కొరింగ మడ అడవుల్లో నివసిస్తున్న పక్షులు, పులికాట్, కొల్లేరు సరస్సుల్లో నివసిస్తున్న స్థానిక, విదేశీ పక్షులపై ఈ గణన జరగనున్నట్లు అటవీశాఖ అదనపు ముఖ్య అటవీ సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే తెలిపారు. ప్రతియేటా ఆసియన్ వాటర్ బర్డ్ సెన్సస్‌ను నిర్వహిస్తున్నారు. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బిఎన్‌హెచ్‌ఎస్) ద్వారా 2011 నుంచి ఇటువంటి గణన నిర్వహిస్తున్నారు. వెట్ ల్యాండ్ ఇంటర్నేషనల్ మార్గదర్శకాలను అనుసరించి ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ గణనల ఆధారంగా ఏటా పక్షి సంపద పెరుగుతున్నట్లు గుర్తించారు. బర్డ్ వాచర్స్ అసోసియేషన్ కూడా ఈ గణనలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతియేటా సైబీరియా, నైజీరియా వంటి దేశాల నుంచి అత్యంత అందమైన పక్షులు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు వలస వస్తుంటాయి. వీటిల్లో కింగ్‌ఫిషర్ పక్షులు కూడా ఆకర్షణీయంగా ఉంటాయి. ఎప్పటికప్పుడు ఈ పక్షులు రావడం పోవడం జరుగుతున్న కారణంగా వీటి సంఖ్య గుర్తించడం కష్టంగానే ఉంటున్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రస్తుతం వీటిపై శాస్త్రీయంగా గణన నిర్వహించనున్నారు. 4, 5 తేదీల్లో కొరింగ పరిసర ప్రాంతాల్లో సర్వే నిర్వహించనున్నారు. అనంతరం 8, 9 తేదీల్లో పులికాట్ ప్రాంతంలో గణన నిర్వహించాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటుచేస్తున్నారు. పక్షుల గణనకు సంబంధించిన ఒక నిపుణుడు, ఆశక్తి గల విద్యార్థి, ఫొటోగ్రాఫర్, ఆ ప్రాంతంపై పట్టు ఉన్న గైడ్ ఈ బృందంలో ఉంటారు. ఒక్క కొరింగలోనే పక్షులు సంచరించే 12 ప్రాంతాలు ఉన్నట్లు గుర్తించారు. పులికాట్, కొల్లేరు సరస్సుల వద్ద కూడా మరిన్ని పక్షులు నివశించే ప్రాంతాలు ఉన్నట్లు చెబుతున్నారు.





వెంకటేశ్వర యూనివర్సిటీలో పులి కదలికలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చిరుత కదలికల గుర్తింపు కోసం దాదాపు పది ప్రత్యేక కెమెరాలను అమర్చినట్లు ఫారెస్ట్ అధికారులు డిఎఫ్‌ఓ, ఎఫ్‌ఆర్‌ఓ లు తెలిపారు. ఈ కెమెరాలు రాత్రి సమయం కూడా పనిచేస్తూ, కదలికలు వచ్చిన వెంటనే రికార్డ్ చేస్తాయని వారు తెలిపారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య సి హెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆధ్వర్యంలో మేరకు ఎస్వీ యూనివర్సిటీలో ప్రత్యేక నిఘాని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరుత తనకన్నా చిన్న సైజు కలిగిన కుక్కలను, జింకలను, ఆవులు, గేదెలు ఆహారంగా తీసుకుంటుందన్నారు. వర్సిటీకి అడవి దగ్గరగా ఉండటం వల్ల ఇక్కడ నివాసం ఉండేవారు ఆవులు, గొర్రెలు, బర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు తదితర డొమెస్టిక్ జంతువులు పెంచుకోవద్దన్నారు.

ఐదు నుంచి సిఎం కుప్పం పర్యటన

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ఈనెల 5, 6, 7వ తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో పర్యటించనున్నారు. సిఎం పర్యటనకు జిల్లా అధికారులందరూ సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఎస్పి మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వివిధ శాఖల అధికారులు విధుల కేటాయింపు నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కడా పిడి వికాస్ మర్మత్ ముఖ్యమంత్రి పర్యటన సంబంధించి వివరాలను వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా 6,7 తేదీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొననున్నారని తెలిపారు. పిఎం సూర్యఘర్‌లో భాగంగా నడిమూరులో సోలరైజేషన్‌కు సంబంధించి ట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్ అధికారులు వారి సర్వే తత్సంబంధ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, క్షేత్రస్థాయి పరిశీలనకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలన్నారు. పర్యటనకు సంబంధించి ప్రతి శాఖకు వారీగా పరిధిలో చేపట్టు కార్యక్రమాల వివరాలపై సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

ఉరవకొండలో వైసిపికి బిగ్‌షాక్

ప్రజాశక్తి-ఉరవకొండ (అనంతపురం)

ఉరవకొండ నియోజకవర్గంలో వైసిపికి పెద్ద షాక్ తగిలింది. వైసిపికి చెందిన ముగ్గురు జెడ్పిటిసిలు, బెలుగుప్ప ఎంపిపితోపాటు పలువురు వైసిపి నాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. విడపనకల్లు మండలం జెడ్‌పిటిసి హనుమంతు, వైసిపి మండల అధ్యక్షులు బసన్న, వజ్రకరూరు జెడ్‌పిటిసి తేజస్విని, ఆమె భర్త వసీకర రమేష్, కూడేరు జెడ్‌పిటిసి అశ్విని, ఆమె భర్త తుప్పటి హరీష్, బెలుగుప్ప మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు పెద్దన్న, తదితరులు టిడిపిలో చేరారు. ఈమేరకు వీరికి మంగళవారం ఉరవకొండ మండల పరిధిలోని మంత్రి పయ్యావుల కౌకుంట్లలో మంత్రి పయ్యావుల కేశవ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలోనే జరుగుతున్న అభివృద్ధిని చూసి టిడిపి వైపు ఆకర్షితులైనట్లు పార్టీలో చేరినట్లు తెలిపారు. వైసిపికి ఉరవకొండ నియోజకవర్గంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రగతి పథంలో పథకాలు పెట్టిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో పయ్యావుల నాయకత్వంలో పనిచేయాలని నిర్ణయించుకుని వైసిపిని వీడుతున్నట్లు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అందరి సహకారంతో సమిష్టిగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆరు నెలలలోనే రాష్ట్రం పురోగతి దిశగా అడుగులు వేస్తుందని మంత్రి వివరించారు. విజనరీ లీడర్ చంద్రబాబు ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రం భవిష్యత్తులో అభివృద్ధి వైపు దూసుకుపోతుందని కేశవ్ తెలిపారు.

జలహారతి కాదు.. అవినీతి హారతి

- మాజీ మంత్రి అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



'తెలుగు తల్లికి జలహారతి అని పేరు పెట్టి... సిఎం చంద్రబాబు సొంత మనుషులకు అవినీతి హారతి' ఇస్తున్నారంటూ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ హయాంలో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును నిస్సిగ్గుగా తన ఆలోచనల నుంచి ఆవిష్కరించినట్లు సిఎం చంద్రబాబు చెప్పుకోవడం దారుణమన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయాంలో 2022లోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రతిపాదనలను సిడబ్ల్యూసికి సమర్పించిన విషయం సిఎం హోదాలో ఉన్న చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. జగన్ ముఖ్యమంత్రిగా అధికారులతో సమీక్షలు చేసి గోదావరి నుంచి 280 టిఎంసిలను కృష్ణా నదిలోకి మళ్లించాలని ప్రతిపాదించారని, 17 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కూడిన కాలువలు వైఎస్ఆర్ హయాంలో 90 శాతం పూర్తి చేశారన్నారు. అవసరమైతే వీటిని మరింత పెంచి, సమాంతర కాల్వ నిర్మించి 40 వేల క్యూసెక్కుల నీటిని కృష్ణా నదికి తీసుకురావాలని వైఎస్ జగన్ ఆలోచన చేశారన్నారు. రైతులకు మేలు చేసే ప్రాజెక్టును కూడా ప్రైవేటు పరం చేయడం చంద్రబాబుకే చెల్లిందన్నారు.



కార్గోలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు త్రైమాసికాల్లో 60 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను నిర్వహించడం ద్వారా 91 ఏళ్ల పోర్టు చరిత్రలో ఒక సువర్ణ ఘట్టాన్ని నమోదు చేసింది. ఈ విషయాన్ని విపిఎ కార్యదర్శి టి.వేణు గోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24లో మొదటి మూడు త్రైమాసికాల్లో చేసిన 59.73 మిలియన్ మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించి నూతన రికార్డును పోర్టు నెలకొల్పిందని, సమిష్టి కృషి, వ్యూహాత్మక ప్రణాళికలు, ఆధునిక లాజిస్టిక్స్, ఆపరేషనల్ వ్యవస్థల సమన్వయంతోనే ఈ అనూహ్య విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. కొత్త 100 ఎమ్‌టి క్రేన్ ఏర్పాటు, విసిటిపిఎల్ ద్వారా యంత్రాంగాన్ని మెరుగుపరచడం, వేగవంతమైన కార్గో నిర్వహణ కోసం అత్యాధునిక సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తేవడం, సాంకేతిక సదుపాయాల్లో భాగంగా రియల్ టైమ్ కార్గో మానిటరింగ్ కోసం, డ్యాష్ బోర్డ్ అనలిటిక్స్, కార్యాచరణ సమర్థత కోసం సమన్వయ వ్యవస్థల ఏర్పాటు నూతన రికార్డుకు దోహదపడ్డాయన్నారు. ఈ ఘనతను సాధించడంలో కృషి చేసిన సిబ్బందిని, భాగస్వాములను పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు. ఈ రికార్డు పోర్టుకు దేశ వాణిజ్యాభివృద్ధిలో ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. పోర్టు యాంత్రీకరణ, బహుముఖ మౌలిక వసతుల కల్పన ద్వారా వివిధ మార్గాలను అనుసంధానం చేసే పనులకు ప్రాధాన్యతనిస్తున్నట్టు పేర్కొన్నారు. అందుకోసం 10 లైన్ల రహదారుల విస్తరణ, అంతర్గత ఫ్లైఓవర్ల నిర్మాణం, ప్రస్తుత టెర్మినల్స్ ఆధునికీకరణ. వంటి పనులను శీఘ్రగతిన చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టులు పోర్టును సముద్ర వాణిజ్యంలో మరింత బలోపేతం చేయడంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు.

పెనమలూరు ఇఒపిఆర్‌డిపై దాడి

ప్రజాశక్తి-కంకిపాడు

కృష్ణా జిల్లా పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వహిస్తోన్న బొమ్మసాని శ్రీనివాస్‌పై పెనమలూరుకు చెందిన ముప్పల బద్రినారాయణ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులకు ఇఒపిఆర్‌డి మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. సమాచార హక్కు చట్టం కింద బద్రినారాయణ అడిగిన సమాచారం ఇవ్వలేదన్న అక్కసుతో తనపై దాడి చేశారని తెలిపారు. బద్రినారాయణను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎంపిడిఒ ప్రణవి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులపైన జరుగుతున్న దాడులు ఆగాలని, లేదంటే ఉద్యోగులు ధైర్యంగా విధులు నిర్వర్తించలేరన్నారు. శ్రీనివాస్‌పై దాడికి నిరసనగా కంకిపాడు, పెనమలూరు మండలాల ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీకి ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పరిశీలన కోసం ఆకస్మిక తనిఖీలు చేసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నియమించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ స్క్వాడ్‌లలో జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి (జెక్యూసిఒ), ఇంజినీరింగ్ కన్సల్టెంట్ (ఇసి), టెక్నికల్ అసిస్టెంట్ (టిఎ)ల నుంచి, మంచి పనితీరు ఉన్న 6 నుంచి 8 మంది సభ్యులను ఎంపిక చేసి స్క్వాడ్ బృందంలోకి తీసుకుంటారని, వీరు చీఫ్ విజిలెన్స్ అధికారి నియంత్రణలో పనిచేస్తారని తెలిపారు. దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసేందుకు అవసరమైన సాక్ష్యాలను బృందాలు సేకరించి సమర్పించాల్సి ఉంటుందన్నారు. పథకం పనితీరు సక్రమంగా లేని ప్రాంతాల్లోనూ బృందాలు తనిఖీ చేస్తాయని చెప్పారు. ఈ మేరకు జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన సూచనలు చేయాల్సిందిగా ఆదేశించారు.

నేతన్న నేస్తం అందేదెన్నడో?

- ఎదురు చూస్తున్న కార్మికులు
- 'చేనేత'కు కొరవడిన సర్కారు సహకారం
- అమలుకు నోచుకోని హామీలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మగ్గాలను నమ్ముకుని జీవిస్తున్న వారికి గత వైసిపి పభుత్వం 'నేతన్న నేస్తం' పేరుతో ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందించింది. నేతన్న నేస్తం ఆర్థిక సాయం ముడి సరుకు, ఇతర అవసరాలకు ఉపయోగించుకునేవిధంగా అండగా నిలిచింది. అయితే 2023 జూలైలో ఆ ప్రభుత్వం చివరి సారిగా సాయం అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలు చేస్తారో లేదో స్పష్టత లేకుండా పోయింది. 7 నెలలు గడుస్తున్నా నేతన్న నేస్తం అమలుపై సర్కారు నోరు మెదపడం లేదు. ప్రభుత్వం అందించే సాయం కోసం చేనేత కార్మికులు ఎదురుచూపులు చూస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని అమీనాబాద్, మూలపేట, గొల్లప్రోలు, ఇదే మండలంలోని తాటిపర్తి, చేబ్రోలు, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, తుని, అమలాపురం, బండారులంక, దుళ్ల, కడియం మండలం వీరవరం, విలసవిల్లి, పుల్లేటికుర్రు, అంబాజీపేట, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం తదితర ప్రాంతాల్లో పలు కుటుంబాలు నేత పనిపై ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లాలో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నేమోదయివున్నారు. మాస్టర్ వీవర్స్ వద్ద స్వయం ఉపాధి చేసుకుంటున్న వారు మరో 40 వేల మంది వరకూ ఉన్నారు. అధికారులు లెక్కల ప్రకారం వీటి పరిధిలో 15,700 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 మగ్గాలున్నాయి.

ఎప్పుడిస్తారో.?

నష్టమైనా, కష్టమైనా చేనేతనే నమ్ముకుని అనేక మంది కార్మికులు కాస్తో కూస్తో కుటుంబాలను పోషించుకుంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ప్రతి ఏటా సాయం అందించడంతో ఆ కుటుంబాలన్నీ ఈ వృత్తిని కొనసాగించుకుంటూ జీవనం సాగించే పరిస్థితి ఏర్పడింది. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి నేతన్న నేస్తం చివరి సరిగా అందించారు. అయితే ఇంకా అనేక మందికి ఈ పథకం అందాల్సి ఉంది. ప్రభుత్వ విధానాల వలన చేనేత కార్మికుల బ్రతుకుల్లో మార్పులు రావడం లేదు. నేతన్న నేస్తం ద్వారా గుడ్డిలో మెల్లగా కాస్త ఉపయోగం ఉన్నప్పటికీ ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికులకు ఉపాధి తగ్గుతూ వస్తుంది. ఉదాహరణకు పడుగు ధర రెండేళ్లతో పోల్చుకుంటే రెట్టింపు అయింది. కిలో పడుగు ధర రూ.5 వేల నుంచి రూ.8 వేలకు పెరిగింది. నేతకు ఉపయోగించే ముడి సరుకు ధరలు విపరీతంగా పెదరగడంతో గణనీయంగా ఉపాధి తగ్గిపోయిందని నేత కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే రూ.300 మించి కూలీ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ప్రభుత్వ పథకాలు కొందరికే దక్కుతుండడంతో మిగిలిన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నేతన్న నేస్తం పథకాన్ని కూటమి ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి పూర్తి స్థాయిలో కార్మికులకు అందజేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.



హామీలు అమలెప్పుడు.?

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వ నేతలు నేతన్న కుటుంబాలకు వరాల జల్లులు కురిపించారు. అనేక హామీలు ఇచ్చారు. వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన నారా లోకేష్ చేనేత కుటుంబాలకి తమ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే చేయూతనందిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వారాహి యాత్ర సందర్భంగా పవన్ కళ్యాణ్ గొల్లప్రోలు మండలం చేబ్రోలులో చేనేత కుటుంబాలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేనేతను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారం లోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నప్పటికీ గత ప్రభుత్వ అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నేతన్న కుటుంబాల పరంగా ప్రభుత్వం ఒక్క నిర్ణయాన్ని కూడా తీసుకున్న పరిస్థితి లేదు. ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని చేనేత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ సాయం లేక, నమ్ముకున్న చేనేత వృత్తి వదలలేక, వచ్చే నష్టాలను భరించలేక.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని ఆయా కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని నేత కార్మికులు కోరుతున్నారు.

సాయం అందించాలి

గత సర్కారు నేతన్న నేస్తం పేరసాయం అందించేది. ఆ మొత్తాన్ని ముడి సరుకు ఇతర అవసరాలకు వాడుకునేందుకు ఉపయోగ పడదేంది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కూడా సాయం అందిస్తానని చెప్పింది. కాని నేటికీ ఒక్క రూపాయి కూడా సాయం అందలేదు. వెంటనే సాయం అందించి నేతన్నలను

వయనాడ్‌పై కేంద్ర అలసత్వం కేరళకు నష్టం

తిరువనంతపురం : వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడిన ప్రమాదాన్ని ' పెను విపత్తు'గా ప్రకటించడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయడాన్ని కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ తీవ్రంగా తప్పుపట్టారు. కేంద్ర ప్రభుత్వ అలసత్వం వల్ల విదేశీ సంస్థల నుంచి సహాయ నిధులను కోరే అవకాశాన్ని కేరళ కోల్పోయిందని మంత్రి తెలిపారు. కొండచరియలు విరిగిపడిన 154 రోజుల తరువాత, రాష్ట్ర ప్రభుత్వం పదేపదే విజ్ఞప్తి చేసిన తరువాత 'తీవ్ర ప్రకృతి విపత్తు'గా ప్రకటించిందన్నారు.

'వయనాడ్ విపత్తు సంభవించిన వెంటనే కేంద్రానికి కేరళ చేసిన మూడు అభ్యర్థనల్లో ఇదొకటి. దీన్ని ఇప్పుడు సూత్రప్రాయంగా ఆమోదించబడింది. ఈ ప్రకటన రెండు నెలల్లోపు వచ్చి వుంటే, విదేశీ సంస్థల సహాయం కోసం కేరళ ప్రభుత్వం విజ్ఞప్తి చేసి ఉండేది' అని మంత్రి తెలిపారు. రూ.1,202 కోట్ల ప్రాథమిక సహాయం కోసం కేరళ చేసిన అభ్యర్థనను కేంద్రం ఇంకా ఆమోదించలేదని మంత్రి తెలిపారు. వయనాడ్ ప్రమాదాన్ని 'తీవ్ర ప్రకృతి విపత్తు'గా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించింది. ఈ మేరకు కేరళ రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శికి హోం శాఖ సంయుక్త కార్యదర్శికి అధికారికంగా సమాచారం ఇచ్చింది.

ప్రైవేట్ మెంబర్ బిల్లులకు తక్కువ సమయం

- స్పష్టం చేస్తున్న గణాంకాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో కీలకమైన ప్రైవేట్ మెంబర్ బిల్లులకు చాలా తక్కువ సమయం కేటాయిస్తున్నారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సంబంధించిన కార్యకలాపాలే జరగాల్సి ఉంటుంది. అది సాంప్రదాయంగా వస్తున్న పార్లమెంట్ నిబంధన. ప్రైవేట్ మెంబర్ బిల్లుకు సమయం కేటాయించటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2019 – 2024 మధ్య ఐదేళ్ల వ్యవధిలో లోక్‌సభ ప్రైవేట్ సభ్యుల బిల్లుల కోసం కేవలం 9.8 గంటలు కేటాయించింది.

రాజ్యసభ ఈ కాలంలో 27.01 గంటల పాటు వెచ్చించింది. స్వతంత్ర పరిశోధనా సంస్థ అయిన పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ విశ్లేషించింది. ప్రైవేట్ సభ్యుల తీర్మానంపై లోక్‌సభ 16.43 గంటలు, రాజ్యసభ 20.78 గంటలు చర్చించింది. 18వ లోక్‌సభలోని రెండు సెషన్‌లో 0.15 గంటలు ఈ బిల్లుల కోసం వెచ్చించగా, రాజ్యసభ 0.62 గంటలు కేటాయించింది. ప్రైవేట్ మెంబర్ తీర్మానాలపై లోక్‌సభ 1.98 గంటలు, లోక్‌సభ సభ 2.09 గంటలు వెచ్చించింది. ఇప్పటి వరకు, 14 ప్రైవేట్ సభ్యుల బిల్లులు మాత్రమే ఆమోదం పొందాయి. 1970 నుంచి ఉభయ సభల్లో ఒక్కటి కూడా ఆమోదించలేదు.

దక్షిణ కొరియా అధ్యక్షుడిపై అరెస్టు వారెంట్లు

సియోల్ : దక్షిణ కొరియాలో సైనిక పాలన విధించి పార్లమెంటుచే అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్టుకు ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం మంగళవారం వారెంట్లు జారీ చేసింది. ఆయన నివాసంలో, కార్యాలయంలో సోదాలు చేపట్టేందుకు కూడా కోర్టు అనుమతించింది. మార్షల్ లా విధించడం తిరుగుబాటు కిందకు వస్తుందా రాదా అనే అంశంపై విచారణ జరుపుతున్నట్లు దేశ అవినీతి నిరోధక సంస్థ తెలిపింది. అయితే యూన్‌ను లాంఛనంగా పదవి నుండి తొలగించనిదే అదుపులోకి తీసుకోవడం గానీ లేదా సోదాలు నిర్వహించడం గానీ చేపట్టడానికి అవకాశాలు లేవని నిపుణులు భావిస్తున్నారు.

సెంట్రల్ సియోల్‌లోని అధ్యక్ష కార్యాలయం, యూన్ నివాసంలో తనిఖీలు చేపట్టడంపై సియోల్ వెస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు వారంట్లు జారీ చేసింది. దక్షిణ కొరియా చట్టం ప్రకారం, తిరుగుబాటు నేత దోషిగా తేలినట్లైతే మరణ శిక్ష లేదా యావజ్జీవం పడే అవకాశం వుంది. కానీ యూన్ అధ్యక్షుడైనందున ఆయనకు క్రిమినల్ ప్రాసిక్యూషన్ నుండి రక్షణ వుంది. అయితే ఈ రక్షణ తిరుగుబాటు లేదా దేశద్రోహం ఆరోపణలకు వర్తించదు. ఈ నెల 14న అభిశంసనకు అనుకూలంగా పార్లమెంట్ ఓటు వేసినప్పటి నుండి యూన్‌కు గల అధికారాలను రద్దు చేశారు. కాగా తన చర్య చట్టబద్ధమైన పాలనా చర్యేనని యూన్ వాదిస్తున్నారు. ప్రధాన లిబరల్ అపోజిషన్ డెమోక్రటిక్ పార్టీని హెచ్చరించడం కోసమే ఈ చర్య తీసుకున్నానని చెబుతున్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ కార్మికుల దేశవ్యాప్త సమ్మె

- ఉద్యోగులకు ఇఇఎఫ్ఐ అభినందనలు



బెంగాల్, కేరళలో ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ కార్మికుల దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) దేశవ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం 'ఒక-గంట సీజ్ వర్క్'ని నిర్వహించింది. లక్షలాదిమంది విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేసిన ఉద్యోగులకు ఇఇఎఫ్ఐ అభినందనలు తెలిపింది. పోరాడుతున్న చండీగఢ్, యుపి విద్యుత్ ఉద్యోగులకు సంఘీభావం, మద్దతు అందించడానికి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజినీర్స్ నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమ్మె సందర్భంగా రాష్ట్ర రాజధానుల్లో భారీ ప్రదర్శనలు జరిగాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రం సమర్పించారు.

ఇఇఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ప్రశాంత ఎన్ చౌదరి మాట్లాడుతూ.. ఈ సమ్మె చండీగఢ్, యుపి విద్యుత్ ఉద్యోగుల వీరోచిత ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటంపై మరింత బలాన్ని చేకూర్చింది. చండీగఢ్ అడ్మినిస్ట్రేషన్ పబ్లిక్ పవర్ యుటిలిటీని ఒక ప్రైవేట్ కంపెనీకి తక్కువ ధరకు బహుమతిగా ఇవ్వడానికి తహతహలాడుతోందని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పూర్వాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ లిమిటెడ్ (పివివిఎన్ఎల్), దక్షిణాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ లిమిటెడ్ (డివివిఎన్ఎల్)పై ఇలాంటి ప్రైవేటీకరణ దాడులు జరుగుతున్నాయని అన్నారు. వీటిని ప్రైవేట్‌కు అప్పగించాలని ప్రయత్నం జరుగుతోందన్నారు. భాగస్వామ్య పక్షాల వాదన వినడానికి బదులుగా, చండీగఢ్ అడ్మినిస్ట్రేషన్, యుపి ప్రభుత్వం ఎసెన్షియల్ సర్వీస్ మెయింటెనెన్స్ యాక్ట్ (ఎస్మా)ను అమలు చేశాయని విమర్శించారు. ఎటువంటి బహిరంగ ప్రదర్శనలు చేయకూడదని నిషేధాన్ని విధించాయని తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తూ విద్యుత్ ఉద్యోగులు ధైర్యంగా నిలబడి విద్యుత్ రంగంలో జాతీయ స్థాయిలో ఒక గంట సీజ్ వర్క్ చేయాలని పిలుపులో భాగస్వామ్యం అయ్యారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని విరమించుకోకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

కేరళలో సీజ్ వర్క్‌లో 24 వేల మందికి పైగా అంటే మొత్తం విద్యుత్ ఉద్యోగుల్లో 90 శాతం మంది పాల్గొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని 63 కార్యాలయాల్లో దాదాపు పదివేల మంది సమ్మెలో పాల్గొన్నారు. తమిళనాడులో జనరేషన్ స్టేషన్లతో సహా 8,400 మంది సమ్మెలో పాల్గొన్నారు. పంజాబ్‌లో పదివేల మంది ఉద్యోగులు, హర్యానాలో 3,500 మంది ఉద్యోగులు, ఆంధ్రప్రదేశ్‌లో 500 మంది, అస్సాంలో 350 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. తెలంగాణలోని 31 జిల్లాల్లో దాదాపు నాలుగు వేల మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. భారీ మంచు కురుస్తున్న నేపథ్యంలో కూడా జమ్ముకాశ్మీర్‌లోని విద్యుత్ ఉద్యోగులు వీధుల్లోకి వచ్చి నిరసన చేపట్టారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్దయెత్తున సమ్మెలో పాల్గొన్నారు. నిరసన ప్రదర్శనలను కూడా చేపట్టారు.

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) ఆధ్వర్యాన రోడ్డు రవాణా కార్మికులు దేశవ్యాప్తంగా సంఘీభావ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎఐఎస్‌జిఇఎఫ్) కూడా సంఘీభావంగా పాల్గొంది. పోరాడుతున్న విద్యుత్ ఉద్యోగులకు సంఘీభావంగా దేశంలోని మొత్తం ట్రేడ్ యూనియన్ ఉద్యమం మద్దతుగా నిలబడాలని కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక పిలుపునిచ్చింది.

కుకీ బంకర్లపై భద్రతా సిబ్బంది దాడులు

- స్థానికులపై లాఠీఛార్జి, బాష్పవాయు ప్రయోగం
- మహిళలుసహా పలువురికి తీవ్రగాయాలు
- జాతీయ రహదారి దిగ్బంధం



ఇంఫాల్ : మణిపూర్‌లో కుకీలపై భద్రతా సిబ్బంది దాడులు కొనసాగుతున్నాయి. కాంగ్‌పోక్పి జిల్లాలో కుకీల బంకర్లపై భద్రతా సిబ్బంది దాడి చేయడంలో అక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. జిల్లాలోని థమ్నా పోక్సి సమీపంలో ఉన్న ఉయోక్‌చింగ్‌లో ఈ సంఘటన జరిగింది. ఇక్కడ ఉన్న బంకర్లపై ఆర్మీ, బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్‌కు చెందిన సంయుక్త బృందాలు మంగళవారం దాడి చేశాయి. బంకర్లను బలవంతంగా అక్రమించుకోవడానికి ప్రయత్నించాయి. బంకర్లపై దాడిని స్థానికులు, మహిళలు అడ్డుకున్నారు. దీంతో వీరిని చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది లాఠీఛార్జి చేయడంతో పాటు, బాష్పవాయువును ప్రయోగించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో మహిళలే అత్యధికంగా ఉన్నారు.

దమనకాండను నిరసిస్తూ జాతీయ రహదారి దిగ్బంధం

భద్రతా సిబ్బంది దాడిని పలు కుకీ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అమాయక గిరిజనులపై దాడితో అక్కడి పరిస్థితి యుద్ధభూమిలా ఉందని గిరిజన ఐక్యతా కమిటీ (సిఓటియు) పేర్కొంది. భద్రతా సిబ్బంది ఈ ప్రదేశం నుంచి తక్షణమే వెనక్కి వెళ్లాలని డిమాండ్ చేసింది. మహిళలపై బలప్రయోగం ఆమోదయోగ్యం కాదని విమర్శించింది. దాడిని నిరసిస్తూ ఈశాన్య భారతాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలకు అనుసంధానించే కీలకమైన జాతీయ రహదారి 2ను సిఓటియు కొన్ని గంటల పాటు దిగ్బంధించింది. ఈ దాడిని ఆదివాసీ గిరిజన నాయకుల ఫోరం (ఐటిఎల్ఎఫ్) మహిళా విభాగం ఖండించింది. క్రిస్మస్ – న్యూ ఇయర్ కాలంలో శాంతి, ప్రేమ, ఆనందాన్ని పంచుకోవడానికి ప్రజలు కలిసివచ్చే కాలంలో ఇలాంటి దాడి ఆందోళన కలిగిస్తోందని తెలిపింది. ఈ ఘటన కుకీ ప్రజల మనోభావాలను గాయపర్చిందని విమర్శించింది. ఈ దాడిని కుకి ఉమెన్ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ (కెడబ్ల్యుఒహెచ్ఆర్) కూడా తీవ్రంగా ఖండించింది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కుకీ మహిళలే లక్ష్యంగా భద్రతా సిబ్బంది దాడికి పాల్పడ్డారని విమర్శించింది.

మణిపూర్ ప్రజలకు క్షమాపణలు

- సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశిస్తున్నా
- సిఎం బీరేన్‌సింగ్

ఇంఫాల్ : సుమారు రెండేళ్ల నుంచి హింసాకాండతో అల్లాడుతున్న మణిపూర్ ప్రజలకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ క్షమాపణలు చెప్పారు. '2024 సంవత్సరమంతా దురదృష్టకరం. గత ఏడాది మే 3 నుంచి ఇప్పటి వరకూ జరుగుతున్న దానికి రాష్ట్ర ప్రజలకు నేను క్షమాపణలు చెబుతున్నాను, అనేకమంది నిరాశ్రయులైనందుకు బాధపడుతున్నాను' అని తెలిపారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని నెలల నుంచి పరిస్థితి మెరుగుపడుతోందని, 2025లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఇప్పటి వరకూ దాదాపు 200 మంది మరణించారు. 12,247 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 625 మంది నిందితులను అరెస్టు చేశాం. పేలుడు పదార్థాలతో సహా సుమారు 5,600 తుపాకీలు, ఆయుధాలు, 35 వేల మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నాం' అని సిఎం తెలిపారు. తగినంత భద్రతా సిబ్బందిని, నిర్వాసితులకు సహాయం చేయడానికి, వారికి కొత్త ఇళ్ల నిర్మించడానికి తగినన్ని నిధులను కేంద్రప్రభుత్వం సమకూర్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. 2023 మే నుంచి మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్నా, అడ్డుకట్ట వేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇప్పటివరకూ అక్కడ పర్యటించలేదు.

దేశ దేశాల్లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



సిడ్నీలో హార్బర్ బ్రిడ్జి వద్ద నూతన సంవత్సర వేడుకలు


వెల్లింగ్టన్ : నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ భారత్‌తో సహా పలు దేశాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. న్యూజిలాండ్‌తో మొదలై ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా సహా దక్షిణ పసిఫిక్ ప్రాంతంలోని దేశాల ప్రజలు కొత్త సంవత్సరానికి సాదరంగా స్వాగతం పలికారు. 2025 వచ్చేసింది. భారత్ కాలమానం ప్రకారం సాయంత్రం 4.30గంటలకే న్యూజిలాండ్ ప్రజలు నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా వెలుగులో, ఆటపాటలతో వారు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక సంస్కృతులు, సాంప్రదాయాలతో ఉత్సవాలు ఆరంభమయ్యాయి. ప్రపంచంలో పలుచోట్ల గత ఏడాది కాలమంతా ఘర్షణలు, దాడులు, రాజకీయ అనిశ్చితులతో గడిచిపోయింది. ఈ కొత్త ఏడాదైనా తమకు అంతా మంచే జరగాలని, అంతటా శాంతియుత వాతావరణం నెలకొనాలని ప్రజలు అభిలషిస్తున్నారు. న్యూజిలాండ్‌లోని అతి పొడవైన స్కై టవర్‌లో అద్భుతమైన లైట్ షో ఏర్పాటు చేశారు.

ఆస్ట్రేలియాలో భారత్ కంటే ఐదున్నర గంటలు ముందే కొత్త సంవత్సరం వచ్చేసింది. సిడ్నీలో 'న్యూ ఇయర్ కేపిటల్ ఆఫ్ ది వరల్డ్' పేరుతో గ్రాండ్ ఒపేరా హౌస్, హార్బర్ బ్రిడ్జి వద్ద అర్ధరాత్రి 12గంటలు కాగానే ఆకాశంలోకి రంగురంగుల కాంతి పుంజాలను వెదజల్లుతూ తొమ్మిది టన్నుల బాణాసంచాను కాల్చారు. ఆ వేడుకలను కళ్లారా చూసేందుకు వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి గుమిగూడారు. పిల్లలు, వృద్ధులనే భేదం లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో చిందులు వేశారు. ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో వివిధ టైమ్‌జోన్‌లు కారణంగా న్యూజిలాండ్ ప్రజలు తొలిసారిగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలకగా, దాదాపు 24గంటల తర్వాత అమెరికన్ సమోవాలో చిట్టచివరిగా కొత్త సంవత్సరం ప్రవేశిస్తుంది.

దక్షిణ కొరియాలో ఆదివారం జరిగిన పెను విమాన ప్రమాదం నేపథ్యంలో ప్రభుత్వం జాతీయ సంతాప దినాలుగా ప్రకటించడంతో అక్కడ ఉత్సవాలు చాలావరకు రద్దయ్యాయి. థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో రెండు ప్రధాన షాపింగ్ మాల్స్‌తో పోటీ పడేలా బాణాసంచా షోలను ఏర్పాటు చేశాయి. గత ఏడాది కాలంగా దాడులు, యుద్ధాలతో తల్లడిల్లిపోతున్న పాలస్తీనా, లెబనాన్, సిరియా, యెమెన్ వంటి దేశాల్లో ఎక్కడా కొత్త సంవత్సరపు ఉత్సాహం కనిపించ లేదు.

విద్వేషాలను రెచ్చగొడుతున్నారు

- మహారాష్ట్ర మంత్రి వ్యాఖ్యలపై కేరళ సిఎం పినరయి విజయన్



తిరువనంతపురం : కేరళను 'మినీ పాకిస్తాన్' అంటూ మహారాష్ట్ర మంత్రి నితీష్ రాణే చేసిన వ్యాఖ్యలు విద్వేషాన్ని రెచ్చగొట్టేలా ఉన్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.'లౌకికవాదం, మత సామరస్యానికి కంచుకోట లాంటి కేరళ పట్ల సంఘ్ పరివార్ వైఖరిని ఈ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ఇటువంటి విద్వేషపూరిత ప్రచారాన్ని ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఐక్యంగా తిప్పికొట్టాలి' అని ఎక్స్‌లో పెట్టిన పోస్టులో విజయన్ పేర్కొన్నారు. ఆదివారం నాడు ఒక బహిరంగ సభలో మహారాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, 'కేరళ ఓ మినీ పాకిస్తాన్' అందువల్లే కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంక ఎంపిలుగా ఎన్నికయ్యారు. ఉగ్రవాదులంతా వారికి ఓటేశారని అన్నారు. రాణే వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందిస్తూ, భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను కాపాడతానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ఒక మంత్రి, దేశంలో భాగమైన ఒక రాష్ట్రాన్ని పాకిస్తాన్ అని, అక్కడి ప్రజలను ఉగ్రవాదులు అని అవమానించడం దారుణమని వ్యాఖ్యానించింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి అతుల్ లోంధే మాట్లాడుతూ, మంత్రి పదవిలో కొనసాగే నైతిక హక్కు రాణేకు లేదన్నారు. దీనిపై ప్రధాని నరేంద్రమోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ నోరు విప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం మాట్లాడుతూ, మతోన్మాద విషాన్ని చిమ్ముతున్న రాణేను తక్షణమే మహారాష్ట్ర ప్రభుత్వం పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. లౌకికవాదానికి, ప్రగతిశీల సామాజిక దృక్పథాలకు కేరళ పర్యాయపదమని ఆయన ఉద్ఘాటించారు. మంత్రి వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని కేసు పెట్టాలన్నారు. భారత దేశానికి, కేరళ ప్రజలకు బిజెపి సమాధానం చెప్పాలని ఎన్‌సిపి (శరద్ పవార్ వర్గం) అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో అన్నారు.

సిపిఎం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా రవిశంకర్ మిశ్రా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



సిపిఎం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యదర్శిగా రవిశంకర్ మిశ్రా ఎన్నికయ్యారు. 35 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక కాగా, 11 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికైంది. మూడు రోజుల పాటు బులంద్‌షహర్‌లో జరిగిన సిపిఎం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర 24వ మహాసభ మంగళవారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం సమన్వయ కర్త ప్రకాష్ కరత్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణీ అలి, కేంద్ర కమిటీ సభ్యులు అమ్రారామ్, విక్రమ్ సింగ్ హాజరయ్యారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి హీరాలాల్ రాజకీయ, నిర్మాణ నివేదికను మహాసభలో ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 35 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. నూతన కార్యదర్శిగా రవిశంకర్ మిశ్రా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా హీరాలాల్ యాదవ్, డిపి సింగ్, ముకుత్ సింగ్, ప్రేమనాథ్ రాయ్, మధు గార్గ్, బిఎల్ భారతి, సురేంద్ర సింగ్, బాబూరామ్ యాదవ్, చంద్రపాల్ సింగ్ తదితరులు ఎన్నికయ్యారు.

ప్రజల్లో విభేదాలు సృష్టించేందుకు ఆలయ వివాదాలు ప్రకాశ్‌కరత్

సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ మసీదుల కింద దేవాలయాలున్నాయనే వివాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని చెప్పారు. ప్రజల్లో విబేధాలు సృష్టించడానికి జరిగే కుట్రలో భాగంగానే ఈ వివాదాలను బిజెపి, ఆర్ఎస్ఎస్ శ్రేణులు తీసుకొస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుత సమయంలో ప్రతిపక్షాల ఐక్యత చాలా ముఖ్యమని అన్నారు. దేశంలో మోడీ సర్కార్ ప్రజలపై భారాలను వేస్తోందని, అన్ని వర్గాల ప్రజలపై దాడులు చేస్తోందని విమర్శించారు. రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువత ఇలా ఏ సమస్య కేంద్ర ప్రభుత్వానికి పట్టదని అన్నారు. నిరుద్యోగం పెరిగిందని, ధరలు పెరుగుదల మునుపెన్నడూ లేనంతగా ఉందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం మత రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలను విచ్ఛిన్నం చేస్తోందని అన్నారు. క్షేత్రస్థాయిలో బలమైన పార్టీగా సిపిఎంను నిర్మించడంతోపాటు బలమైన వామపక్ష ఐక్యతను నెలకొల్పాలని పిలుపునిచ్చారు.

సిపిఎం అండమాన్ నికోబర్ రాష్ట్ర కార్యదర్శిగా డి.అయ్యప్పన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



సిపిఎం అండమాన్ నికోబర్ రాష్ట్ర కార్యదర్శిగా డి.అయ్యప్పన్ ఎన్నికయ్యారు. 19 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక కాగా, అందులో 8 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సిపిఎం అండమాన్ నికోబర్ దీవుల 12వ రాష్ట్ర మహాసభ పోర్ట్ బ్లెయిర్‌లోని జరిగింది. ఈ మహాసభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు జి.రామకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు సుజన్ చక్రవర్తి హాజరయ్యారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి డి. అయ్యప్పన్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై ప్రతినిధులు చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా డి.అయ్యప్పన్ తిరిగి ఎన్నికయ్యారు. 19 మంది సభ్యులతో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక కాగా, అందులో ఎనిమిది మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికైంది.

సిపిఎం కర్ణాటక రాష్ట్ర కార్యదర్శిగా కె. ప్రకాష్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



సిపిఎం కర్ణాటక రాష్ట్ర కార్యదర్శిగా కె. ప్రకాష్ ఎన్నికయ్యారు. 35 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. వారిలో 12 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికైంది. తుమకురులో మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం కర్ణాటక రాష్ట్ర మహాసభ మంగళవారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎంఎ బేబి, ఎ.విజయరాఘవన్ హాజరయ్యారు. సిపిఎం కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి యు.బసవరాజు రాజకీయ, నిర్మాణ నివేదికను మహాసభ ముందు ఉంచారు. ఈ నివేదికపై 67 మంది సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది. 34 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. నూతన కార్యదర్శిగా కె. ప్రకాష్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా యు.బసవరాజు, జి,సి బైరెడ్డి, మీనాక్షి సుందరం, ఎస్. వరలక్ష్మి, గోపాలకృష్ణ హరాలహళ్లి, సయ్యద్ ముజీబ్, యాదవశెట్టి, మునివెంకటప్ప, కె. బాలు, కె. మహంతేష్, చంద్రప్ప హొస్కేరా ఎన్నికయ్యారు.

ప్రజలను భ్రమల్లో ముంచొద్దు

మొదటిపేజీ తరువాయి

ఎక్కడ వస్తోంది? విద్యుత్ ఉత్పత్తిదారులు లాభాలు పోగేసుకుంటుంటే, వాటి దుష్ఫలితాలను మనం ఇప్పటికీ అనుభ విస్తున్నాం.' అని అన్నారు. చంద్రబాబు ఇప్పుడు కూడా కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను అమలు చేస్తూ, ప్రజలను మాత్రం భ్రమల్లో ముంచెత్తు తున్నారని చెప్పారు. అయితే, ఆ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు ఇప్పుడు లేరని అన్నారు. రాజధానిని భారీ ప్రాజెక్టుగా పెట్టుకోవద్దని, అవసరాల మేరకు పూర్తి చేసుకోవాలని 2014లోనే చెప్పినా బాబు పట్టించుకోలేదని, ఫలితంగా ఇప్పటికీ రైతులు అభద్రతా భావంలో బతకవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు.



సిపిఎం రాష్ట్ర మహాసభ లోగోను ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాసరావు, సిహెచ్.బాబూరావు, ఎం.సీతారాం, వి.వెంకటేశ్వర్లు, లోకనాథం, డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ

గందరగోళంగా బనకచర్ల

చంద్రబాబు అట్టహాసంగా ప్రకటించిన గోదావరి–బనకచర్ల లింకు ప్రాజెక్టు అస్పష్టంగా, గందరగోళంగా ఉందని అన్నారు. 80 వేల కోట్ల రూపాయలతో పిపిపి పద్దతిలో మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామంటూ బాబు చేసిన ప్రకటనను ఆయన ప్రస్తావించారు. పిపిపి పద్దతిలో సాగునీటి ప్రాజెక్టు ఎలా సాధ్యమవుతుంది? అని ప్రశ్నించారు.' 'వసూలు చేసుకుంటారు' అని చెబుతున్నారు. ఎవరు వసూలు చేసుకుంటారు? ఎవరి నుండి వసూలు చేస్తారు? నీటిఛార్జీలు పెడతారా?' అని అన్నారు. 'రాయలసీమకు నీటిని తీసుకుపోవడానికి అన్ని పార్టీలు అంగీకరించిన పోతిరెడ్డిపాడు వంటి ప్రాజెక్టులు ఉన్నాయి. వాటన్నింటిని వదిలేసి ఇంత భారీ ఖర్చుతో ఈ ప్రాజెక్టును హడావిగా తెరమీదకు ఎందుకు తెస్తున్నారు? 'ఈ ప్రాజెక్టుపై అఖిలపక్షం నిర్వహించాలి.. ప్రజలందరి ఆమోదంతో ముందుకు వెళ్లాలి' అని డిమాండ్ చేశారు. అదే సమయంలో రాష్ట్రంలో ఇప్పటికీ కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల పనితీరును ఆయన వివరించారు. 20 సంవత్సరాల క్రితం ఎన్‌టి రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన హంద్రీ–నీవా ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదని, ఫలితంగా వరదలు వచ్చినప్పుడు అనంతపురం జిల్లాల్లో పెద్ద ఎత్తున నీరు వృద్ధా అవుతోందని అన్నారు. ఉత్తరాంధ్రలో జంఝావతి లాంటి ప్రాజెక్టులు రూ.50 కోట్లు రూ.100 కోట్లు పెడితే పూర్తవుతాయని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు రూ.1200 కోట్లు కేటాయిస్తే చాలని అన్నారు పోలవరం ఇప్పటికీ పూర్తికాలేదని, నిర్వాసితుల సంగతి పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ ప్రాజెక్టులన్నింటిపైనా అఖిలపక్షం నిర్వహించాలని కోరారు.

భూములపైనే కన్ను!

పారిశ్రామిక ప్రగతి గురించి 20 ఏళ్ల నుండి చెబుతున్నారు కానీ పరిశ్రమలు మాత్రం రావడం లేదని అన్నారు. అదే సమయంలో భూములు మాత్రం కార్పొరేట్ కంపెనీల పాలవుతున్నాయని అన్నారు. ఇది రాష్ట్రాభివృద్ధికి ఏమాత్రం మంచిది కాదని చెప్పారు. పంటలు పండే భూములను తీసుకుని బీడు పెడుతున్నారని అన్నారు. నక్కపల్లిలో 5,400 ఎకరాలు ఫార్మాసిటీ కోసం 20 ఏళ్ల క్రితం తీసుకున్నారని, ఇప్పటికీ ఒక్క ఫార్మా కంపెనీ రాలేదని తెలిపారు. దానిలో 3000 ఎకరాలను మిట్టల్‌కు కేటాయించి స్టీలు ప్యాక్టరీ పెట్టి విశాఖ స్టీలును దెబ్బతీస్తున్నారని అన్నారు. ఇప్పుడు మరలా బల్క్ డ్రగ్ ప్రాజెక్టని ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ప్రజలపై భారాలు వేయడానికి లాంటి భ్రమలు సృష్టిస్తున్నారని తెలిపారు. కాకినాడలో అరబిందో ఫార్మా కంపెనీ కాలుష్యంపై మత్స్యకారులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. వాన్‌పిక్‌లో 20 వేల ఎకరాలు తీసుకున్నారని, నాలెడ్జ్ హబ్‌లోనూ, ప్రకాశం జిల్లాలో నిమ్జ్ పెడతామన్నారని ఒక్కటీ కూడా పెట్టలేదని విమర్శించారు. కొత్తగా రిలయన్స్‌కు ఐదు లక్షల ఎకరాలు ఇస్తామని చెబుతున్నారని, ఆ భూమిలో పంట పండిస్తే ఏడాకి రూ.5000 కోట్లు ఆదాయం వస్తుందన్నారు విశాఖలో 200 ఎకరాలు అదాని డేటా సెంటర్‌కు ఇచ్చారని, ఇప్పటి వరకూ పునాదిరాయి కూడా పడలేదని తెలిపారు. ఫ్యాక్టరీలు పెట్టకుండా ఖాళీగా ఉన్న భూములను వెనక్కు తీసుకుని రైతులకు ఇచ్చేయాలని డిమాండు చేశారు.

పవన్‌వి నిజాయితీ లేని విమర్శలు

మొదటిపేజీ తరువాయి

ఇటీవల .జరిగిన ఎన్నికల్లో హైదరాబాద్‌లో బిజెపి తరపున పోటీచేసిన మాధవీలత ఉపయోగించుకుని లబ్ధి పొందడానికి ప్రయత్నించారని అన్నారు. కొత్తగా ఆర్ఎస్ఎస్ మతం తీసుకున్న పవన్ కల్యాణ్ అవే మాటలు ఇప్పుడు చెబుతున్నారని అన్నారు. ఎంఐఎంను పావుగా ఉపయోగించుకుని మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో బీహార్లో బిజెపి గెలిచిందని, లెక్కలు పరిశీలిస్తే ఇదే విషయం తేలుతుందని అన్నారు. రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేసిన పవన్ కల్యాణ్ లౌకికవాదం హిందువులకేనా అని ప్రశ్నించడం అవమానకరమని అన్నారు. రాజ్యాంగం అన్ని మతాలకు ఒకటేనని, మతాల ప్రమేయం లేకుండా ప్రభుత్వ వ్యవహారాలు నిర్వహించాలనే లౌకిక వాదం చెబుతుందని వివరించారు. దేశంలో మెజార్టీ మతంగా ఉన్న హిందువులకు మైనార్టీలను కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అయితే, ఆర్ఎస్ఎస్, బిజెపిలు హిందువుల్లో అసత్యాలను ప్రచారం చేస్తూ వారిలో భయాందోళనలను రేకెత్తిసున్నాయని ఆయన అన్నారు. దీనిని ఎదుర్కోవడానిక బదులుగా పవన్‌కల్యాణ్ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి జరుగుతోందని మాట్లాడుతున్నారని అన్నారు. అక్కడి కమ్యూనిస్టు పార్టీ దాడులను ఖండించడంతోపాటు హిందువుల కోసం పోరాడుతోందని చెప్పారు. సిపిఎం కూడా ఖండించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, మన దేశంలోని మణిపూర్‌లో జరుగుతున్న దాడుల పై ప్రధానమంత్రి మోడీతో పాటు పవన్ కల్యాణ్ కూడా మాట్లాడటం లేదని చెప్పారు. 'మణిపూర్ ప్రజలు భారతీయులు కారా? వారి గురించి ఎందుకు మాట్లాడరు?' అని ప్రశ్నించారు. భారతరత్న అంబేద్కర్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అవమానించేలా మాట్లాడినా పవన్‌కల్యాణ్ ఖండించకపోవడం అన్యాయమని చెప్పారు. నిజాయితీగా మాట్లాడాలని, ఇషం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని అన్నారు.

నూతనోత్తేజం



నిన్న నేడు రేపంటూ
సాగుతున్నవి రోజులు
రోజులు వారాలై
వారాలన్నీ పక్షములై
పక్షములతో మాసాలు
పన్నెండు మాసాల వత్సరము
ఆంగ్ల నామ నూతన సంవత్సరము
జగతిన పంచును నూతనోత్సాహము
గడిచిన రోజులు అనుభవాలై
వర్తమానం సాగుతుండగా
భవిష్యత్తుకు బీజాలవును
కంటి రెప్పపాటు క్షణాలు తిరుగుతూ
వెలుగు కాంతుల రవళులు నింపును
రాత్రి పగలు అమాస వెన్నెల
నింగినేల పంచభూతాల సంరక్షణలో
దిక్కులన్ని కూడా దేదీప్యమానమై
ఆంగ్లవత్సర శోభలు స్వాగతించును
వెనుదిరిగిన దొరకదు సమయము
ముందుకు సాగిన ఉరకదు సమయం
ముచ్చటించిన నిలువదు సమయము
సమయముతోని సమరం జేసి
పనులందులలో వృద్ధిగా నిలిచి
రంగమేదైనా రయమున సాగి
విశ్వ విజేతగా నిలువాలి
ఉజ్వల భవితను స్వాగతపరచాలి

- ఉండ్రాళ్ళ రాజేశం, సిద్దిపేట,
99669 46084.

స్వాగతం

రావే రావే కొత్త సంవత్సరమా
తేవే తేవే తేనె మధురిమా..

గడిచిన కాలం గతించగా
నడిచిన నేల నాట్యమాడగా
పూల సువాసన పరిమళించగా
మట్టి వాసనతో మనసు నిండగా
రావే రావే కొత్త సంవత్సరమా
తేవే తేవే తేనె మధురిమా..


జల జల జారే జలపాతంలా
జల్లున తాకే హిమపాతంలా
గల గల పారే సెలయేరుల్లా
కిల కిల పాడే కోయిలమ్మలా
రావే రావే కొత్త సంవత్సరమా
తేవే తేవే తేనె మధురిమా..

మనసు నిండుగా వేడుక చేయగా
సిగ్గుతో సిన్నది సింగారించగా
నీ ఆశలే శ్వాసతో దారి అవ్వగా
పెద్దల దీవెన నిండుగ ఉండగా
రావే రావే కొత్త సంవత్సరమా
తేవే తేవే తేనె మధురిమా..

భగ భగ మండే సూర్య కాంతితో
చల్లగా తాకే చంద్రబింబితో
చేదు జ్ఞాపకం మంటలో కలిపి
మంచి మాటనే మమతతో నింపి
రావే రావే కొత్త సంవత్సరమా
తేవే తేవే తేనె మధురిమా..

- ఇమంది అశోక్ కుమార్,
ఎస్జీటీ, విశాఖపట్నం,
93928 69899.

నేను గీసిన బొమ్మ





కె.సాయి సాకేత్
5వ తరగతి,
జెనిసిస్ ఇంటర్నేషనల్ స్కూలు,
మదీనాగూడ, హైదరాబాద్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కొత్త సంవత్సరం .. కొత్త సంకల్పాలు ...

కాలం ... నిత్య ప్రవాహం. మన ఘన స్వాగతాలతో దానికి సంబంధం లేదు. ఉత్సాహ నిరుత్సాహాలతో నిమిత్తం లేదు. మనం విభజించుకున్న కాలం, మన పనులకు, ప్రణాళికలకు అన్వయించుకున్న కాలం... మనకే పరిమితమైన ఒకానొక గణన సౌలభ్యం. కొండకోనల్లో పుట్టి.. ఏటవాలుగా ప్రవహించి... సముద్రపు మహాలోగిలిలో కలిసిపోయే నదీనదాలను వాటి దారిన వాటిని పోనివ్వం మనం. ఆనకట్టలు కడతాం. కాలువలు తవ్వుతాం. పొలాలకు మళ్లిస్తాం. బంగారం పండిస్తాం. కాలం కూడా అంతే! మన ప్రమేయం లేకుంటే దాని మానాన అది పోతుంది. క్షణక్షణానికి క్షయమై పోతుంది. ఆ క్షణాన మనం ఏం చేశామో అదే మనకు మిగులుతుంది. పాత సంవత్సరం పోతూ పోతూ కొన్ని అనుభవాలను ఇచ్చింది. ఆ అనుభవాల పునాది మీద కొత్త సమస్యలను అధిగమిస్తూ సాగిపోవడమే మన పని.

'హేపీ న్యూ ఇయర్' అని భూనభోంతరాలు దద్దరిల్లేలా స్వాగతించటం కేవలం మన సరదా. వచ్చీ రాగానే ఏ సంవత్సరమూ దానికదే సంతోషాలనో, విషాదాలనో వెంట బెట్టుకురాదు. నిన్నటి నిజం మీదనే నేటి ఫలితం నిర్మితమవుతుంది. నేటి పునాది మీదే రేపటి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఇప్పటిదాకా మనచుట్టూ ఉన్న వాస్తవిక పరిస్థితులే రేపూ ఉంటాయి. అవి అలాగే కొనసాగాలా, మార్పేమన్నా తేవాలా అన్నది కాలం మీద ఆధారపడి ఉండదు. కాలం ఒడిలో సాగే మన ఆలోచనల మీద, ఆచరణ మీదా ఆధారపడి ఉంటుంది.

నూతనోత్సాహానికి స్వాగతం!

మన ఆశలు, ఆలోచనలు, అనుభవాలూ జోడించనంతవరకూ కాలానికి ఏ ప్రత్యేకతా లేదు. మన సమస్త ఉద్వేగాలను, ఉత్సాహాలను; కార్యకలాపాల ప్రణాళికలను కాలంతో ముడిపెట్టుకున్నాం. అప్పుడు కాలం మన పనుల్లో భాగమయింది. మన ఉద్వేగాలకు నెలవయింది. మన పనులకు గుర్తుగా నమోదైంది. మన జ్ఞాపకాల్లో ఇమిడిపోయింది. ప్రణాళికగా రూపొందింది. సమీక్షగా సాక్షాత్కరించింది. అసలు ఒకటేమిటి? సమస్తమూ అయింది. మానవాళి సర్వ అవస్థలకు, సకల వ్యవస్థలకు సాక్షి అయింది. అందుకే కాలానికి ఇంత విలువ. కొత్త సంవత్సరానికి ఇంత స్వాగత సంరంభం. నూతనోదయానికి ఇంతింత ఉత్సాహ ఉత్సవం!

వెనక్కి తిరిగి చూస్తే ...

నడిచొచ్చిన దారిలో అనేక ఆశలు ఉంటాయి. ఆవేశాలు ఉంటాయి. అడియాసలు ఉంటాయి. ఆయాసాలూ ఉంటాయి. సంతోషాలు ఉంటాయి. సందళ్లు ఉంటాయి. విజయాలు ఉంటాయి. వీరవిహారాలూ ఉంటాయి. అన్నిటినీ ఒకసారి తలపోసుకోవడం బాగుంటుంది. వెళుతూ వెళుతూ ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోవటం మంచిదే! ఎంత దూరం వచ్చామో, ఇంకా ఎంతదూరం వెళ్లాలో తెలుస్తుంది. నడుస్తూ నడుస్తూ ఆగి ఒకసారి గతాన్ని అవలోకించటమూ మంచిదే! మనం ఎక్కడికి వెళ్లాలి? ఏ దారిలో వెళ్లాలి? ఎంత కాలంలో వెళ్లాలి? ఏమేమి సమీకరించుకోవాలి? ఎలా సమకూర్చుకోవాలి? ఆలోచించుకోవటానికి ఇదొక సరైన సమయం. చేసిన పొరపాట్లను, తెలుసుకున్న పాఠాలను, వేసుకున్న ప్రణాళికలను ఒకసారి అవలోకించుకునే తరుణం. వెళ్లే పాత సంత్సరం, వచ్చే కొత్త సంవత్సరం చేసే మేలూ, చెప్పే సూత్రమూ ఇదే!

కొత్తలో ఏదైనా కొత్తగానే ఉంటుంది. ఉత్సాహంగా ఉంటుంది. కొత్త సంవత్సరం కూడా అంతే! ఈ ఏడాది ఫలానా పనులు చేయాలి. ఫలానా సాధించాలి... అనుకుంటాం. మొదట్లో కొద్ది రోజులు బాగానే నడుస్తుంది. రోజులు పాతగిల్లుతాయి. లక్ష్యాలు అటకెక్కుతాయి. రోజువారీ జీవితం ముందుకొచ్చి, అంతా తన ఆధీనంలోకి తీసేసుకుంటుంది. దైనందిన జీవితానికి ప్రత్యేకించి ప్రణాళిక అవసరం ఉండదు. రోజువారీ అవసరాలే దానిని ఎప్పటికప్పుడు నిర్ణయిస్తాయి. ప్రత్యేకంగా సాధించాలి అనుకున్న వాటికే ప్రణాళిక అవసరమవుతుంది. ప్రణాళిక అమలు చేయాలి అంటే – ప్రత్యేక శ్రద్ధా, కృషీ అవసరమవుతాయి.



"నిన్న నీది కాదు.
రేపటికి రూపు లేదు.
నేడే ఈనాడే నీది. ఈ క్షణమే నీది.
నీ ప్రయత్నం ఇప్పుడే మొదలెట్టు.
ఈ క్షణమే ఆరంభించు." అని పెద్దలు చెబుతారు. నిజమే ఇది.
దీనిని ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటే– సగం విజయం సాధించినట్టే మనం.

పని విభజనతో లక్ష్య సాధన

విద్యార్థి కావొచ్చు. ఉద్యోగార్థి కావొచ్చు. గృహస్థు కావొచ్చు. వ్యాపారి అవొచ్చు. నాయకుడు, అధికారి, రచయిత, ఉద్యోగి .. ఎవరైనా కావొచ్చు. రంగాన్ని బట్టి, అవసరాన్ని బట్టి లక్ష్యాలు ఉంటాయి. అసలు ఈ ఏడాది మన లక్ష్యాలు ఏమిటి? మనసులో అనుకోవడం కాదు. ఒక కొత్త డైరీలో, మంచి నోట్‌బుక్‌లో రాసుకోవాలి. లక్ష్యం పెద్దది అయినప్పుడు దానిని చిన్న చిన్నవి విభజించాలి. నెలలవారీ, రోజువారీ, గంటలవారీగా నిర్దిష్ట లక్ష్యానికి నిర్దిష్ట కాలవ్యవధి పెట్టుకోవాలి. కట్టెల మోపును మూకుమ్మడిగా కాక విడివిడిగా అయితే విరిచేయవచ్చు అన్న నీతికథ మనకు తెలుసు. అలాటి అనుభవాలను, మానవ విజయాలను అన్వయించుకోవటం మన సంకల్పానికి బలాన్నిస్తుంది.

ఆచరణ అన్నిటికన్నా ముఖ్యం


ఒక పనికి సంబంధించి లక్ష్యమూ, ప్రణాళిక రూపొందించుకోవటం సులభమే! దాని అమలే కష్టం. ఎందుకంటే ఎప్పటికప్పుడు ఏదొక రూపంలో ఆటంకాలూ అవాంతరాలూ వచ్చి పడుతూ ఉంటాయి. స్మార్టుఫోన్లూ, సోషల్ మీడియాలూ అరచేతిలోకి వచ్చాక ఈ సమస్య మరింత పెరిగింది. వాటిని వినియోగించే సమయంపై నియంత్రణ అవసరం. ఏ అవసరాలకు, ఎంతమేరకు వాడాలో నిర్దిష్టంగా, నిక్కచ్చిగా నిర్ణయించాలి. కఠినంగా అమలు చేయాలి. సమయం వృథా కానివ్వకుండా కాపాడుకోగలిగితే– నిర్దేశిత లక్ష్యాలకు అదే పెద్ద బాసట అవుతుంది.

ప్రపంచంలోని అందరికీ 24 గంటలే ఉంటాయి. కొందరు వారి వారి రంగాల్లో ఎంతెంతో సాధిస్తారు. ఇతర విషయాల్లోనూ వెనకబడకుండా పురోగమిస్తారు. సాధకులకు, సామాన్యులకు మధ్య తేడా ఇదే! సాధకులు ప్రతి క్షణాన్ని తమ లక్ష్యం వైపు నడిపిస్తారు. విజయాన్ని సాధిస్తారు. సామాన్యులు ఏం జరిగితే దానిలో మునిగి తేలతారు. బిజీ అయిపోతారు. కాలాన్ని తమకు అనుకూలంగా, అనుగుణంగా మార్చుకున్నవారు విజేతలవుతారు.

'కాలంలో, దాని మాయాజాలంలో పడడం కాదు; కాలం వెంట పడు. కాలం నిన్ను గుర్తు పెట్టుకునేంతగా వెంటపడు.' అన్నాడొక కవి. నిజమే; విజేతలకు, పరాజితులకు ఉన్న సమయం ఒక్కటే! తేడా అల్లా దానిని వాడుకునే తీరే.. వాడుకను బట్టే ఫలితం. మన కాలం మన ఆధీనంలో ఉండాలి. అప్పుడు అన్నీ కాలం వెంటే ఉంటాయి. హేపీ న్యూ ఇయర్...!

- జీవన డెస్క్

రంగవల్లి



16 చుక్కలు, 6 వరుసలు, 6 వచ్చేవరకు



15 చుక్కలు 8 వచ్చేవరకు
(మధ్య చుక్క)

జిఎల్. గిరిజా మంజునాథ్,
మడకశిర, శ్రీసత్యసాయి జిల్లా.

మార్చి నుండి షూటింగ్



అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబోలో ఓ సినిమా రాబోతుందన్న సంగతి తెలిసిందే. హారిక హాసిని ఎంటర్‌టైన్‌మెంట్స్, గీతా ఆర్ట్స్ నిర్మాణంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రం షూటింగ్ కోసం ప్రత్యేకంగా ఓ స్టూడియో నిర్మిస్తున్నారు. స్క్రిప్ట్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. జనవరిలో స్పెషల్ ప్రోమోతో సినిమాని ప్రకటించనున్నారు. '2025 మార్చి నుంచి చిత్రీకరణ ప్రారంభం కానుంది' అని నిర్మాత నాగవంశీ తెలిపారు.

అభిమానులు తీరు మార్చుకోవాలి



అభిమానులు తనపై చూపే ప్రేమ తీరును మార్చుకోవాలని యశ్ విజ్ఞప్తి చేశారు. జనవరి 8న యశ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా బహిరంగంగా వేడుకలు చేయొద్దని అభిమానులని కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'కొత్త సంవత్సరం వస్తుందంటే మనం కొత్త నిర్ణయాలు తీసుకోవాలి. జీవితంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించాలి. ఎన్నో ఏళ్లుగా మీరంతా నాపై చూపిస్తున్న అభిమానం అసాధారణమైంది. ఆ క్రమంలో దురదృష్టవశాత్తూ కొన్ని సంఘటనలు జరిగాయి. ముఖ్యంగా నా బర్త్‌డే సెలబ్రేషన్స్ విషయంలో.. మీ అభిమానాన్ని, ప్రేమను గ్రాండ్ ఈవెంట్స్‌తో చూపే ప్రయత్నం చేయొద్దు. మీరంతా సురక్షితంగా ఉండడం, అనుకున్న లక్ష్యాలు చేరుకోవడం, ఆనందంగా ఉండడమే నాకు పెద్ద బహుమతి. మీరు హృదయపూర్వకంగా చెప్పే శుభాకాంక్షలు నాలో స్ఫూర్తి నింపుతాయి' అని పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా అభిమానులందరికీ ముందుగానే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

'ఓ చెలియా..' మంచి ప్రేమకథా చిత్రం




'ఓ చెలియా..' సినిమాలో మాకు అవకాశం రావటం ఎంతో మంచి పరిణామం. మేము ఎంతో కష్టపడి ఈ సినిమాలో నటించాం. స్క్రీన్‌ప్లే కూడా బాగా వస్తుందని నమ్ముతున్నాం. నేటి యువతరానికి మంచి సందేశాన్ని ఇచ్చే ప్రేమకథా చిత్రమిది. కుటుంబ ప్రేమకథా చిత్రంగా నిలుస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. నిర్మాత రూపశ్రీ, దర్శకుడు రాజశేఖర్‌రెడ్డిలు నాణ్యప్రమాణాల విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఎంతో కష్టపడి చేస్తున్నారు. మా వంతుగా మేము నటన విషయంలో చాలా కాన్ఫిడెన్స్‌గా పనిచేశాం. చిత్రాన్ని ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నాం' అని నటుడు నాగ ప్రవణ్, నటి కావేరీ అన్నారు. ఎస్ఆర్ఎస్ మూవీస్ పతాకంపై ప్రొడక్షన్ నం.1గా నిర్మితమవుతున్న సినిమా 'ఓ చెలియా..' నటుడు నాగ ప్రవణ్, కావేరీ, ఆద్య, అజయ్‌ఘోష్ తదితరులు ప్రధాన తారాగణం. కోపూరు రూపశ్రీ నిర్మాతగానూ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఎం.నాగరాజశేఖర్‌రెడ్డి వహిస్తున్నారు. సంగీతం ఎంఎం కుమార్. డిఒపి సురేష్‌బాల, ఎడిటర్ ఉపేంద్ర, రచన ఆలీ, చంద్రమౌళి కోపూరు. ఈ సినిమా తుది షెడ్యూల్ షూటింగ్ కొనసాగుతోంది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌ను పూర్తిచేసి విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత రూపశ్రీ, దర్శకుడు నాగరాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు.



టైమ్ పడ్తుంది

సిద్దూ జొన్నలగడ్డతో సితార ఎంటర్టైన్మెంట్స్ ఓ సినిమా నిర్మిస్తోంది. ఈ చిత్ర నిర్మాత నాగవంశీ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'నేను సిద్దూ కలిసి ఓ సినిమా చేయబోతున్నాం. అది 'అర్జున్ రెడ్డి' సినిమా లాంటి తరహా కథ. ప్రస్తుతం ఈ సినిమా కథ చర్చల్లో ఉంది. ఇప్పటి దాక సిద్దూని ఒకలా చూసారు ఈ సినిమాతో మరొకలా చూస్తారు. కానీ ఈ చిత్రం వచ్చేందుకు చాలా టైమ్ పడుతుంది' అని అన్నారు.

'శిశిరం'లో కెజిఎఫ్ భాను



శ్రీకృష్ణ ఆర్ట్స్ బ్యానర్‌పై డాక్టర్ రావిపాటి వీరనారాయణ సమర్పణలో అమిరినేని వెంకట్‌ప్రసాద్, సాదు చలపతి, కన్నెగంటి రవి, అనిల్ మూకిరిలు నిర్మాతలుగా కనిపర్తి రత్నాకర్ దర్శకత్వంలో 'శిశిరం' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈనెల మూడోవారం నుంచి రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. కెజిఎఫ్ సినిమాలో నటించిన బాలనటుడు మాస్టర్ భానుకు దేశవ్యాప్తంగా గుర్తింపువచ్చింది. భానుతోపాటుగా మాస్టర్ పుష్కర్లు కూడా ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శిశిరంలో నటిస్తుండటం అందరి దృష్టి భానుపై పడింది. కెజిఎఫ్ 2లోనూ నటిస్తున్నారు. బి.వెంకట్, వసంత యామిని, అయినాల మల్లేశ్వరరావు, కనపర్తి మధుకర్, అజయ్ ఇండియన్, గోము, మాస్టర్ రిత్విక్ సూరజ్, దిలీప్ సాయి, ప్రదీప్ సాయి, ఎం.జాశ్విక్ జ్ఞానానంద్ కృష్ణ, బి.అభిషేక్, చిరంజీవి ప్రీహాన్స్, చిరంజీవి స్రుణిసాయి తదితరులు నటిస్తున్నారు. సంగీతం శాండీ అద్దంకి, సాహిత్యం సురేంద్ర రొడ్డ, గానం టి.భవ్య, డిఒపి మురళీ, ప్రొడక్షన్ ఎం.శ్రీకాంత్, సహ దర్శకుడిగా రమణ, సినిమాటోగ్రాఫర్ డి.మధు, ఎస్ఎస్ వి శేఖర్.

త్వరలో 'శివలింగపురం' షూటింగ్ ప్రారంభం





సరోజని ఆర్ట్స్ పతాకంపై అలనాటి నటుడు నాగభూషణం మనువడు అభిద్‌భూషణ్ హీరోగా తెరకెక్కనున్న సినిమా 'శివలింగపురం'. తోట మోహనరావు నిర్మాతగా నూతన దర్శకుడు సుతారి శ్రీధర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సైన్స్‌ఫిక్షన్ మూవీ షూటింగ్ త్వరలోనే ప్రారంభిస్తామని దర్శకుడు శ్రీధర్ తెలిపారు. జనవరిలో ముహూర్తం షాట్, ఫిబ్రవరి, మార్చి నెలల్లో కర్నాటకలోని మురుడేశ్వర్, రాష్ట్రంలోని అరకు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహిస్తామన్నారు. త్వరలోనే మిగతా వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. సరికొత్త కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తామన్నారు. అన్ని తరగతుల ప్రేక్షకులు మెచ్చేలా ఈ సినిమా ఉంటుందన్నారు.

భరత్, హెబ్బర్ సెంచరీలు

- **మేఘాలయాపై ఆంధ్ర ఘన విజయం**


ముంబయి: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు హవా కొనసాగుతోంది. మంగళవారం జరిగిన గ్రూప్–బి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 10 వికెట్ల తేడాతో మేఘాలయాపై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయా 48.2ఓవర్లలో 223పరుగులకు ఆలౌటైంది. చక్రవర్తి(101) సెంచరీకి తోడు అర్పీత్(66) అర్ధసెంచరీతో రాణించగా.. ఆంధ్ర బౌలర్లు సందీప్(5/26), మహీప్, ఆంజనేయులు రెండేసి వికెట్లతో సత్తా చాటారు. ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు వికెట్ కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు హెబ్బర్(109), శ్రీకర్ భరత్(107) సెంచరీలతో రాణించి మ్యాచ్‌ను ముగించారు. ఈ గెలుపుతో గ్రూప్–బిలో ఐదు మ్యాచ్‌లు ముగిసేసరికి ఆంధ్ర జట్టు 16పాయింట్లతో 2వ స్థానంలో ఉంది.



శ్రీకర్ భరత్ (107పరుగులు)

భారీ లక్ష్యాన్ని ఛేదించిన హైదరాబాద్

అహ్మదాబాద్ వేదికగా జరిగిన మరో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు కర్ణాటకపై భారీ లక్ష్యాన్ని ఛేదించింది. గ్రూప్–సిలో భాగంగా రైల్వే గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కర్ణాటక నిర్దేశించిన 321పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. తొలుత కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 320పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్(124) వరుసగా మూడో శతకంతో మెరిసాడు. రవి చరణ్(80) అర్ధసెంచరీతో రాణించాడు. ఇక హైదరాబాద్ జట్టులో వరుణ్ గౌడ్(109నాటౌట్), తిలక్ వర్మ(99) బ్యాటింగ్‌లో రాణించి మ్యాచ్‌ను ముగించాడు. ఈ గెలుపుతో గ్రూప్–సిలో హైదరాబాద్ జట్టు 5 మ్యాచ్‌లు ముగిసేసరికి 12పాయింట్లతో 6వ స్థానంలో ఉంది.



మయాంక్ (124పరుగులు)

పంజాబ్ రికార్డు స్కోర్..

విజయ్ హజారే వన్డే టోర్నీలో పంజాబ్ జట్టు రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. అభిషేక్ శర్మ సారథ్యంలోని పంజాబ్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగి ఐదు వికెట్ల నష్టానికి 424పరుగులు చేసింది. దీంతో లిస్ట్–ఎ క్రికెట్ చరిత్రలో 400కు పైగా పరుగులు చేసిన 9వ జట్టు, విజయ్ హజారే టోర్నీలో అత్యధిక పరుగులు కొట్టిన ఐదో జట్టుగానూ పంజాబ్ నిలిచింది. అభిషేక్ శర్మ(17), ప్రభ్‌సిమ్రన్ సింగ్(125) రాణించడంతో పంజాబ్ జట్టు 5వికెట్ల నష్టానికి 424పరుగులు చేయగా.. ఛేదనలో సౌరాష్ట్ర జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 367పరుగులకు ఆలౌటైంది. అర్పీత్ వసవాడ(104) సెంచరీతో రాణించాడు.

లిస్ట్–ఎ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన జట్లు..

1. **తమిళనాడు 506/2 (అరుణాచల్‌ప్రదేశ్, 2022)**
2. **ముంబయి 457/4 (పాండిచేరి, 2021)**
3. **మహారాష్ట్ర 427/6 (మణిపూర్, 2023)**
4. **బెంగాల్ 426/4 (సర్వీసెస్, 2022)**
5. **మధ్యప్రదేశ్ 424/3 (నాగాలాండ్, 2022)**
6. **పంజాబ్ 424/5 (సౌరాష్ట్ర, 2024)**

టెస్టులకు రోహిత్ శర్మ గుడ్‌బై ?

జస్ప్రీత్ బుమ్రాకు పగ్గాలు..!



మెల్‌బోర్న్: బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా 1–2తో వెనుకబడ్డ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించనున్నాడా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఇప్పటికే తన రిటైర్మెంట్ గురించి సెలక్టర్లు, బిసిసిఐతో చర్చించిన రోహిత్ శర్మ.. సిడ్నీ టెస్టులో ఓడితే తన మనసులోని మాటను వెల్లడించనున్నాడట. ఒకవేళ ఆ మ్యాచ్‌లో గెలిచి.. టీమిండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్(2023–25) ఫైనల్ చేరే అవకాశాలు ఉంటే మాత్రం.. ఆ మెగా మ్యాచ్ వరకు సారథిగా కొనసాగాలని భావిస్తున్నట్లు ఓ పత్రిక కథనం పేర్కొంది. ఏదేమైనా సిడ్నీ టెస్టుతో రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ భవితవ్యంపై ఒక అంచనాకు రావొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ రోహిత్ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటిస్తే అతడి స్థానంలో జస్‌ప్రీత్ బుమ్రా పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది. సారథిగా, బ్యాటర్‌గా రోహిత్ శర్మ ఇటీవల గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో 3–0తో వైట్‌వాష్‌కు గురైన రోహిత్ సేన.. ఆస్ట్రేలియాలోనూ విఫలమవుతోంది. బోర్డర్– గావస్కర్ ట్రోఫీలో భాగంగా పెర్త్ టెస్టులో జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యంలో గెలుపొందిన టీమిండియా.. రోహిత్ కెప్టెన్సీలో అడిలైడ్, బ్రిస్బేన్, మెల్‌బోర్న్ టెస్టుల్లో తీవ్రంగా నిరాశపరిచింది. కెప్టెన్‌గానూ, బ్యాటర్‌గానూ రోహిత్ శర్మ దారుణంగా విఫలమయ్యాడు. ముఖ్యంగా మెల్‌బోర్న్ టెస్టులో రోహిత్(3, 9) ఓపెనర్‌గా వచ్చినా రాణించలేకపోయాడు. టి20 ప్రపంచకప్–2024 తర్వాత రోహిత్ శర్మ అంతర్జాతీయ టి20లకు వీడ్కోలు పలికాడు.

నాకౌట్‌కు వైశాలి

ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్



న్యూయార్క్: భారత మహిళా యువ గ్రాండ్‌మాస్టర్ రమేశ్‌బాబు వైశాలి ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో నాకౌట్ స్టేజ్‌కు చేరింది. మంగళవారం జరిగిన హోరాహోరీ చివరిరౌండ్ గేమ్‌లో వైశాలి... గుణినాపై విజయం సాధించింది. ఈ గెలుపుతో వైశాలి 9.5పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో ఒక్క ఓటమి కూడా చవిచూడకుండా టాప్‌లో నిలిచింది. 11 రౌండ్‌లో ముగిసేసరికి ఎనిమిది విజయాలు, మూడు డ్రాలతో సత్తా చాటింది. దీంతో నానా జాగ్నిడ్జ్(జార్జియా), పోలినా షువలోవా(పోలండ్), డిఫెండింగ్ ఛాంపియన్ వాలెంటినా గునినా(రష్యా)ల రికార్డును సమం చేసింది. ఈ టోర్నమెంట్‌లో తన ప్రదర్శనపట్ల సంతోషంగా ఉన్నట్లు, ఈ ఉత్సాహంతో నూతన ఏడాదిలో మరిన్ని విజయాలను సాధిస్తానని పేర్కొంది.

టాప్–8లో నిలిచిన గ్రాండ్‌మాస్టర్లు..

1.	వైశాలి రమేశ్‌బాబు	9.5/11
2.	లీ టింగ్జే(చైనా)	8.5/11
3.	కటెర్నా లిగ్నో(రష్యా)	8.0/11
4.	వలెంటినా గునినా(రష్యా)	8.0/11
5.	జూ డెన్‌జున్(చైనా)	8.0/11
6.	కరిస్సా యిప్(అమెరికా)	8.0/11
7.	బిబిసర అసుబయో(కజకిస్తాన్)	8.0/11
8.	జూ జినెర్(చైనా)	8.0/11

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68